

## ఆశలు ఆవిరి అర్జెంటీనా చేతిలో భారత్ చిత్తు

ఐదు దశాబ్దాలుగా హాకీ ప్రపంచకప్‌లో అందని ద్రాక్షగా ఊరిస్తున్న ట్రోఫీ కల మరోసారి నెరవేరలేదు. ఈసారైనా మన ప్లేయర్లు టైటిల్ కరువు తీరుస్తారని ఆశించిన భారత హాకీ అభిమానులకు మళ్లీ నిరాశే ఎదురైంది. సెమీస్ రేసులో నిలవాలంటే అర్జెంటీనాపై కనీసం మూడు గోల్స్ తేడాతో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ 3-5తో ఓటమిపాలై సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. ఆట ఆరంభం నుంచి చివరిదాకా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన అర్జెంటీనా ఆటగాళ్లలో డొమెనె (33, 45వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా జాక్విన్ టొస్కని (1వ), నికోలస్ (6వ), లుకాస్ (53వ) తలా ఓ గోల్ కొట్టారు. భారత్ నుంచి సుఖ్‌జీత్ సింగ్ (10, 58వ) డబుల్ గోల్స్ చేయగా హార్ధిక్ సింగ్ (60వ) ఒక గోల్ సాధించాడు. ఈ ఓటమితో సెమీస్ రేసు నుంచి తప్పకున్న భారత్.. వర్గీకరణ మ్యాచ్‌లలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.


# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
మంగళవారం
25.08.2026

సంపుటి : 16 సంచిక: 329
పేజీలు: 8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


# హరీశ్‌రావు ఫాంహౌస్ ప్రభుత్వం కాదిది

- 22ఏ భూములపై పొంగులేటి కీలక ప్రకటన
- 98 శాతం జెన్యూన్ భూముల రిజిస్ట్రేషన్
- టోల్‌ఫ్రీకి 980 ప్రత్యేక కాల్స్
- బీఆర్ఎస్ ఆరోపణలపై మంత్రి ఫైర్
- హరీశ్‌రావుపై పొంగులేటి ప్రశ్నలు
- ప్రజలు భయపడొద్దన్న మంత్రి

**తెలంగాణలో 22ఏ భూముల వ్యవహారం రాజకీయంగా మరింత వేడెక్కింది. హైదరాబాద్ నగర పరిధిలో ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో చేర్చారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో కనిపించిన ఫాంహౌస్ పాలనకు భిన్నంగా, తమది ప్రజా ప్రభుత్వం అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తలెత్తుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిజాయితీ, జవాబుదారీతనంతో పరిష్కారాలు చూపుతున్నామని తెలిపారు. సమస్యలను రాజకీయంగా వాడుకుంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం సరికాదని హితవు పలికారు. 22ఏ అంశంపై కొత్త కథనాలు అల్లి ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ఇదే సమయంలో హరీశ్‌రావు తీరుపైనా మంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. అందుకే అధికార యంత్రాంగం నుంచి పూర్తి వివరాలు సేకరించి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను స్పష్టంగా వివరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు స్పష్టత ఇవ్వడమే లక్ష్యమని మరోసారి చెప్పారు.**

**చట్టం, స్టేట్ బ్యూరో:**

22ఏ భూముల విషయంలో గతంలో రిలాక్స్ ఇచ్చిన కేసులకు ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చిందని పొంగులేటి వెల్లడించారు. జెన్యూన్‌గా గుర్తించిన భూముల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయలేని వాటిని చేయలేమని స్పష్టంగా చెప్పామని వివరించారు. దీంతో అర్హత ఉన్న భూముల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ పరిధిలో 22ఏ పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవాలు తక్కువగా, రాజకీయ ఉద్దేశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. భూమి హక్కులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట వివరాలతో పరిశీలించి, సాధ్యమైన పరిష్కారం అందిస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్ వ్యవస్థపై అనవసర అనుమానాలు కలిగించే ప్రయత్నాలను ప్రజలు నమ్మవద్దని మంత్రి కోరారు. ప్రభుత్వ నిర్ణయాలు ఆధారాలతో ఉంటాయని, వాటిపై రాజకీయ ఆరోపణలు చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ రికార్డులే ఆధారమని తెలిపారు అన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ పనిచేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కూడా పొంగులేటి ఖండించారు. ఇప్పటివరకు ఆ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని తెలిపారు. రిపీటెడ్ కాల్స్ తొలగించిన తర్వాత 980 ప్రత్యేక కాల్స్ నమోదయ్యాయని వివరించారు. వాటిలో 547 వ్యవసాయానికి అనుబంధమైన అంశాలకు సంబంధించినవని, మరో 433 కాల్స్ వ్యవసాయేతర విషయాలపై వచ్చాయని చెప్పారు. ఈ




గణాంకాలు టోల్‌ఫ్రీ సేవ పనిచేస్తున్నదానికి స్పష్టమైన ఆధారమని పేర్కొన్నారు. ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. భూముల విషయంలో ఎవరైనా నిజమైన సమస్యతో ముందుకొస్తే ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అనవసర ప్రచారంతో ప్రజల్లో గందరగోళం పెంచడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని చెప్పారు. ఈ వివరాలు అధికారిక వ్యవస్థల ద్వారా సేకరించామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇదే సమయంలో హరీశ్‌రావుపై పొంగులేటి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అధికారంలో ఉన్న సమయంలో బీజేపీ నేతలకు సంబంధించిన సంస్థలతో వ్యాపార సంబంధాలపై ప్రశ్నలు తలెత్తాయని మంత్రి ఆరోపించారు. తన కంపెనీ వెబ్‌సైట్‌ను ఎందుకు మూసివేశారంటూ హరీశ్‌రావును ప్రశ్నించారు. తప్పు ఏమీ లేకపోతే వెబ్‌సైట్ మూసివేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ప్రభుత్వ భూముల అమ్మకాలు, పర్సంటేజీల ఆరోపణలు, తరువాత వెబ్‌సైట్ మూసివేత వంటి అంశాలపై హరీశ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఓట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టడం ఆయనకు మొదటి నుంచీ అలవాటేనని విమర్శించారు. ఎన్నికల రాజకీయాల కోసం ప్రజల్లో అనుమానాలు పెంచడం కాకుండా, వాస్తవాలను వివరించాలని సూచించారు. 22ఏ వివాదాన్ని రాజకీయ ఆయుధంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం మాత్రం సమస్యల పరిష్కారంపైనే దృష్టి పెడుతోందని స్పష్టం చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. మొత్తంగా 22ఏ భూముల అంశం తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక వివాదంగా మారింది. ఒకవైపు బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తుండగా, మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గణాంకాలు, ప్రభుత్వ చర్యలను ప్రస్తావిస్తూ ప్రతివాదన చేస్తున్నారు. జెన్యూన్ భూముల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని చెప్పడం ద్వారా వైఖరిని స్పష్టం చేసింది. టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చిన 980 ప్రత్యేక కాల్స్ వివరాలను వెల్లడించడం ద్వారా సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రిజిస్ట్రేషన్ కాలేదని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. సమస్య ఉన్న ప్రతి కేసును పరిశీలిస్తామని చెప్పారు. హరీశ్‌రావు చేసిన విమర్శలకు సమాధానంగా వ్యక్తిగత, వ్యాపార అంశాలను ప్రస్తావించిన పొంగులేటి, 22ఏ భూములపై స్పష్టత కోసం ప్రభుత్వం మరింత సమాచారం అందిస్తుందా, ప్రతిపక్షాలు తమ ఆరోపణలకు ఆధారాలు చూపుతాయా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వివాదం రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. భూముల స్థితిగతులపై అధికారిక సమాచారం తీసుకోవాలని సూచించారు.

## మంత్రి కొండా సురేఖకు షాక్!

- అటవీశాఖలో అధికారుల డిప్యూటేషన్లు రద్దు
- కొండా సురేఖకు తెలియకుండానే డిప్యూటేషన్ల రద్దు.. సర్వత్ర చర్చ
- అటవీశాఖలో మంత్రి ప్రమేయం లేకుండానే కీలక ఉత్తర్వులు జారీ



**చట్టం, హైదరాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు చెక్ పెట్టింది. ఆమెకు తెలియకుండానే పలువురు అధికారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రిపై కొండా సురేఖ కూతురు చేసిన అనుచిత వ్యాఖ్యలు కొన్ని రోజులుగా రాజకీయాల్లో చర్చాంశనీయంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల నుంచి సోమవారం ఉదయం తిరిగి వచ్చిన తరువాత వరుస భేటీల అనంతరం సాయంత్రం మీడియా సమావేశంలో తన అమెరికా పర్యటన రద్దుపై కేంద్ర ప్రభుత్వం చేసిన ఆటంకాలపై విరుచుకు పడ్డారు. అనంతరం కొండా సురేఖ అంశాన్ని విలేకరులు ప్రస్తావించగా క్రమశిక్షణ కమిటీ అన్నింటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించిన గంట వ్యవధిలోనే కొండా సురేఖ శాఖల్లో ముఖ్యమైన అటవీశాఖలో డిప్యూటేషన్ల రద్దు సంచలనంగా మారింది. డిప్యూటేషన్‌పై ఉన్న అధికారులను ప్రధాన ముఖ్యాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అది కూడా ఆమెకు తెలియకుండానే ఉత్తర్వులు వెలువడడంతో ఆమెకు పొమ్మన లేక పొగబెడుతున్నారని సర్వత్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన ఆరోపణలు





- సీఎం సోదరుడు నాపై నిఘా పెట్టాడు
- డీజీపీకి సోషల్ మీడియా వేదికగా లేఖ
- ఏసీపీ స్థాయి పోలీసు అధికారిని నియమించినట్లు ఆరోపణ

**చట్టం, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి నిఘా ఆరోపణలు కలకలం రేపాయి. నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సోదరుడిని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తన కదలికలను పర్యవేక్షించేందుకు ఏసీపీ స్థాయి పోలీసు అధికారిని నియమించినట్లు తనకు సమాచారం అందిందని అర్వింద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం 'ఎక్స్' వేదికగా డీజీపీకి లేఖ రాశారు. అర్వింద్ తన లేఖలో డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి.. తాను ఆయనను ఎన్నో సంవత్సరాలుగా సమర్థవంతమైన పోలీసు అధికారిగా గౌరవిస్తున్నానని పేర్కొన్నారు. అయితే, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుడి ఆదేశాల మేరకు ఒక ఏసీపీ స్థాయి అధికారిని తన కదలికలపై నిఘా పెట్టేందుకు నియమించినట్లు తన దృష్టికి వచ్చిందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎంపీ అర్వింద్.. డీజీపీని నేరుగా ప్రశ్నించారు. తెలంగాణ పోలీసు వ్యవస్థ భారత రాజ్యాంగం, చట్టబద్ధమైన అధికార వ్యవస్థ ప్రకారం పనిచేస్తోందా? లేక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆదేశాల మేరకు పనిచేస్తోందా? అని ప్రశ్నించారు. పోలీసు శాఖ రాజ్యాంగానికి, చట్టానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని, ఏ ఒక్క రాజకీయ కుటుంబానికి జవాబుదారీగా ఉండకూడదని అర్వింద్ వ్యాఖ్యానించారు. ప్రజాప్రతినిధి కదలికలపై అక్రమంగా నిఘా పెట్టడం జరిగితే అది తీవ్రమైన అంశమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. అర్వింద్ చేసిన ఈ ఆరోపణలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఒక ఎంపీ స్థాయి ప్రజాప్రతినిధిపై పోలీసు నిఘా పెట్టారనే ఆరోపణ కావడంతో ఈ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఆరోపణల నేపథ్యంలో అసలు ఏసీపీ స్థాయి అధికారిని ఎవరిని నియమించారు? ఏ ఆదేశాల మేరకు నియామకం జరిగింది? అర్వింద్ కదలికలపై నిజంగానే పోలీసు నిఘా ఉందా? ఉంటే దానికి కారణం ఏమిటి? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. డీజీపీ కార్యాలయం లేదా తెలంగాణ పోలీసు శాఖ నుంచి దీనిపై అధికారిక స్పందన వస్తేనే ఆరోపణలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్

- రామగుండంలో NIA మెరుపు దాడులు
- ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో NIA సోదాలు
- రామగుండంలో ఇంజనీరింగ్ విద్యార్థి అదుపులోకి
- 54 ప్రభుత్వ వెబ్‌సైట్లే టార్గెట్‌గా కుట్ర
- ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు సహా డిజిటల్ పరికరాలు సీజ్




**చట్టం, స్టేట్ బ్యూరో:**

భారత ప్రభుత్వ వెబ్‌సైట్లను లక్ష్యంగా చేసుకుని విదేశీ ఉగ్రమూకల సాయంతో సైబర్ దాడులకు పాల్పడ్డ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) విచారణను తీవ్రతరం చేసింది. 'ఆపరేషన్ సిందూర్' సమయాన దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా జరిగిన సైబర్ టెర్రరిజం కుట్రపై నమోదు చేసిన కేసు ఆధారంగా, దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లోని ఐదు ప్రధాన ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

**ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు..**
**రామగుండంలో విచారణ**

గుజరాత్ సైబర్ టెర్రరిజం కేసు (RC01/2025/NIA/AMD) విచారణలో భాగంగా ఎన్ఐఏ బృందాలు కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొంది తెలంగాణలోని కరీంనగర్/పెద్దపల్లి జిల్లా రామగుండం, మహారాష్ట్రలోని పుణె జిల్లా జున్నార్, గుజరాత్‌లోని ఖేడా జిల్లా నడియాడ్, బీహార్‌లోని గోపాల్‌గంజ్, , ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఈ దాడులు చేపట్టాయి. ఈ సోదాల్లో భాగంగా తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగుండం అయోధ్యనగర్‌లో ఉన్న ఒక ఇంజనీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్ నివాసంపై ఎన్ఐఏ అధికారులు సడన్ రైడ్ చేశారు. ఉగ్రవాద ముఠాలు, హ్యాకర్లతో సంబంధాలు ఉన్నాయనే అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని సమీపంలోని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘంగా విచారిస్తున్నారు.

**54 ప్రభుత్వ వెబ్‌సైట్లపై దాడుల కుట్ర..**
**డిజిటల్ పరికరాలు స్వాధీనం**

'ఆపరేషన్ సిందూర్' సమయంలో దేశ భద్రతకు సంబంధించి కీలకమైన క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (CII), రక్షణ రంగ సేవలు, ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 54 అధికారిక వెబ్‌సైట్లను హ్యాక్ చేసేందుకు , డిస్ట్రిబ్యూటెడ్ డినైయల్‌ఆఫ్‌సర్వీస్ (DDoS) దాడులతో స్తంభింపజేసేందుకు నిందితులు తీవ్రంగా ప్రయత్నించినట్లు ఎన్ఐఏ తెలిపింది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడంతో పాటు సైబర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఈ దాడులకు ప్లాన్ చేశారని వెల్లడించింది. ఈ కేసును మొదట గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ATS) నమోదు చేయగా, దీని తీవ్రత దృష్ట్యా ఎన్ఐఏ స్వీకరించి దర్యాప్తు చేస్తోంది. సోదాల సందర్భంగా హ్యాకింగ్ కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలు, కీలక డాక్యుమెంట్లతో పాటు 3 ల్యాప్‌టాప్‌లు, 5 మొబైల్ ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లు , ఇతర డిజిటల్ డివైస్‌లను ఎన్ఐఏ సీజ్ చేసింది.

## తెలంగాణ అసెంబ్లీకి ముహూర్తం ఫిక్స్..

- సెప్టెంబర్ 7 నుంచి వర్షా కాల సమావేశాలు
- నియోజకవర్గాలపై సీఎం రేవంత్ ఫోకస్
- BAC భేటీలో పనిదినాలపై నిర్ణయం
- విపక్షాల అస్త్రాలతో వేడెక్కనున్న సభ



**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి రోజులు దగ్గరపడ్డాయి. రాష్ట్రంలో ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలు, రగులుతున్న సామాజిక అంశాల నడుమ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారు. ఈ సమావేశాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది.

**నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టండి..**
**సీఎం రేవంత్ ఆదేశం**

అసెంబ్లీ సమావేశాల తేదీల ఖరారు నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ తమ తమ నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సీఎం సూచించారు. ముఖ్యంగా నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల (ఇరిగేషన్) ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణపై అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తికావని తేల్చిచెప్పారు. భూసేకరణ, పరిహారం (R&R), ఫారెస్టు క్లియరెన్సులకు సంబంధించి నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పనులను వేగవంతం చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ వర్షాకాల సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై తొలి రోజు సభ ముగిసిన తర్వాత స్పష్టత రానుంది. అసెంబ్లీ స్పీకర్ అధ్యక్షతన జరగబోయే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (BAC) సమావేశంలో ఉభయ సభల పనిదినాలపై అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సెషన్‌లో ప్రభుత్వం పలు కీలక బిల్లులతో పాటు కొన్ని విధానపరమైన నిర్ణయాలను సభ ముందుకు తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది. మరోవైపు ప్రజా సమస్యలను అస్త్రాలుగా మలుచుకుని ప్రభుత్వాన్ని సభలో గట్టిగా కార్నర్ చేసేందుకు ప్రధాన ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి.

## స్మార్ట్ మీటర్ల పై టీఆర్ ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం

- ఆ ఆలోచన ఉపసంహరించుకోవాలని సూచన
- ఆదానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ

**చట్టం, సిటీ బ్యూరో :**



తెలంగాణలో గృహ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో పేద ప్రజలకు అందుతున్న విద్యుత్ సబ్సిడీలను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆమె ఆరోపించారు. ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విద్యుత్ సంస్కరణలలో భాగమని కవిత ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన పథకానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తూ తెలంగాణలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం ద్వారా కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కల్పించే ప్రయత్నం జరుగుతోందని, ముఖ్యంగా అదానీ వ్యాపారానికి అనుకూలంగా ఈ విధానం తీసుకొస్తున్నారని ఆమె ఆరోపించారు. కొత్త స్మార్ట్ మీటర్లు ప్రీపెయిడ్ విధానంలో పనిచేస్తాయని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్‌కు ముందుగా రీచార్జ్ చేసుకున్నట్టే విద్యుత్ వినియోగానికి కూడా ముందుగానే డబ్బు చెల్లించాల్సి వస్తుందని ఆమె అన్నారు. రీచార్జ్ చేసిన మొత్తం పూర్తయితే విద్యుత్ సరఫరా నిలిచిపోయే పరిస్థితి వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ విధానం పేద, మధ్యతరగతి కుటుంబాలపై

మిగతా 2లో..

# మండి బిర్యానీలో బొద్దింక కలకలం..
# వికారాబాద్ హోటళ్లపై నిఘా ఎక్కడ?

**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :**

- రెస్టారెంట్‌లో ఆహార భద్రతపై తీవ్ర ప్రశ్నలు
- ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారుల తనిఖీలు పెంచాలని డిమాండ్
- హోటళ్లు, దాబాలు, బిర్యానీ సెంటర్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలంటున్న ప్రజలు








వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా ప్రాంతంలో ఉన్న ఓ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో మండి బిర్యానీలో బొద్దింక కనిపించిందన్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆహారం తీసుకునేందుకు వచ్చిన వినియోగదారులు ఈ ఘటనపై రెస్టారెంట్ సిబ్బందిని ప్రశ్నించినట్లు సమాచారం. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. డబ్బులు చెల్లించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందుతుందనే నమ్మకంతో హోటళ్లకు వచ్చే వినియోగదారులకు ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆహారంలో పురుగులు లేదా బొద్దింకలు కనిపిస్తే కిచెన్ పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, పెస్ట్ కంట్రోల్, సిబ్బంది పరిశుభ్రతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పట్టణాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు వేగంగా పెరుగుతున్నాయి. బయట భోజనం చేసే వారి సంఖ్య కూడా పెరుగుతున్న నేపథ్యంలో ఆహార నాణ్యతపై క్రమం తప్పకుండా తనిఖీలు జరగాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**కిచెన్ పరిశుభ్రత ఎలా ఉంది?**

మాంసాన్ని సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేస్తున్నారా?
ఫ్రిజ్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయా?
వంట నూనెను ఎన్నిసార్లు ఉపయోగిస్తున్నారు?
మిగిలిపోయిన ఆహారాన్ని తిరిగి వినియోగిస్తున్నారా?
బొద్దింకలు, ఈగలు, ఎలుకల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?
FSSAI లైసెన్సులు సక్రమంగా ఉన్నాయా?
అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని వినియోగదారులు అంటున్నారు.

**గతంలోనూ బొద్దింక ఘటన**

2023 డిసెంబర్‌లో వికారాబాద్ కలెక్టరేట్ సమీపంలోని ఓ హోటల్‌లో చికెన్ 65లో బొద్దింక కనిపించిందన్న ఘటన అప్పట్లో వార్తల్లోకి వచ్చింది. ఆ సమయంలోనూ కిచెన్ పరిశుభ్రత, చికెన్ నిల్వ విధానం, ఫుడ్ సేఫ్టీ తనిఖీలపై ప్రశ్నలు తలెత్తాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా వ్యాప్తంగా ఆహార విక్రయ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమనే డిమాండ్ మరోసారి ముందుకొచ్చింది.

**బిర్యానీ సెంటర్లపై ప్రత్యేక తనిఖీలు అవసరం**

వికారాబాద్ జిల్లా ప్రధాన పట్టణాల్లో బిర్యానీ సెంటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు, ప్రధాన రహదారులు, కాలేజీల పరిసరాలు, వ్యాపార కేంద్రాల్లో చికెన్, మటన్, బిర్యానీ విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

**మాంసం ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు?**

ఎంతసేపు నిల్వ చేస్తున్నారు?
ముందురోజు మిగిలిన ఆహారాన్ని మరుసటి రోజు వాడుతున్నారా?
వండిన ఆహారాన్ని ఎంతసేపు బయట ఉంచుతున్నారు?
పాత్రలు, వంటగది సామగ్రిని సక్రమంగా శుభ్రం చేస్తున్నారా?

**అనే అంశాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.**

తాండూరు, పరిగి, కొడంగల్‌లోనూ తనిఖీలు చేపట్టాలి
తాండూరు, పరిగి, కొడంగల్ ప్రాంతాల్లోనూ హోటళ్లు, దాబాలు, టిఫిన్ సెంటర్లు, మాంసాహార విక్రయ కేంద్రాల సంఖ్య పెరుగుతోంది. మాంసం నిల్వ, డ్రైనేజీ, చెత్త నిర్వహణ, తాగునీటి నాణ్యత, కిచెన్ పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.
ఒక్క హోటల్‌ను లక్ష్యంగా చేసుకోవడం కాకుండా జిల్లా వ్యాప్తంగా ఒకే ప్రమాణాలతో తనిఖీలు నిర్వహిస్తే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఆరోపణలపై విచారణ అవసరం**

రెస్టారెంట్ సిబ్బందిని ప్రశ్నించిన వినియోగదారులతో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి నిజానిజాలను నిర్ధారించాల్సి ఉంది. మున్సిపల్, శానిటేషన్, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో స్పందించి ఘటన జరిగిన రెస్టారెంట్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని ఆహార విక్రయ కేంద్రాలను తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**తప్పులుంటే చర్యలు తీసుకోవాలి**

తనిఖీల సమయంలో పాడైన ఆహారం, గడువు ముగిసిన పదార్థాలు, పరిశుభ్రత లోపాలు, సరైన నిల్వ సౌకర్యాలు లేకపోవడం వంటి అంశాలు బయటపడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. లోపాల తీవ్రతను బట్టి నోటీసులు ఇవ్వడం, ఆహార నమూనాలను పరీక్షలకు పంపడం, పాడైన పదార్థాలను తొలగించడం, అవసరమైతే చట్టపరమైన చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. అదే సమయంలో పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఆహారం అందిస్తున్న హోటళ్లకు అనవసర ఇబ్బందులు కలగకుండా తనిఖీలు పారదర్శకంగా జరగాలని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

**ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి**

హోటళ్లలో ఆహారం తీసుకునే సమయంలో అసాధారణ వాసన, రంగు మారిన మాంసం, పురుగులు కనిపిస్తే ఆ ఆహారాన్ని తీసుకోకుండా నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే ఫొటోలు, బిల్లు వంటి ఆధారాలను భద్రపరచి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. "రుచి బాగుంది" అన్న ఒక్క కారణంతో ఆహారం సురక్షితమని భావించలేం. పరిశుభ్రత, నిల్వ విధానం, నీటి నాణ్యత, మాంసం నాణ్యత, కిచెన్ పరిస్థితి అన్నీ సమానంగా కీలకం.

**ఇప్పుడు ప్రశ్న ఒక్కటే...**

వికారాబాద్ జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, బిర్యానీ సెంటర్లపై స్పెషల్ ఫుడ్ సేఫ్టీ డ్రైవ్ ఎప్పుడు? ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో అధికారులు తక్షణమే స్పందించి తనిఖీలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## స్మార్ట్ మీటర్ల పై టీఆర్ ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం



**మొదటి పేజీ తరువాయి**

అదనపు భారాన్ని మోపుతుందని విమర్శించారు. తెలంగాణలో అర్హత ఉన్న కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది. స్మార్ట్ మీటర్ల వల్ల ఈ పథకం ప్రయోజనాలకు భంగం కలిగే అవకాశం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న విద్యుత్ ప్రయోజనాలు, సెలూన్లు, లాండ్రీ షాపులకు సంబంధించిన ఉచిత, సబ్సిడీ విద్యుత్ ప్రయోజనాలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు.

**పవర్ ఎక్స్ పోలో స్మార్ట్ మీటర్ల ప్రదర్శన**

హైదరాబాద్‌లో ఆగస్టు 22 నుంచి మూడు రోజుల పాటు పవర్ ఎక్స్‌పో నిర్వహించారు. విద్యుత్ రంగంలో కొత్త సాంకేతికతలు, స్మార్ట్ గ్రిడ్‌లు, విద్యుత్ ఆదా, ఆధునిక విద్యుత్ నిర్వహణ వ్యవస్థలను ఇందులో ప్రదర్శించారు. ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించిన స్మార్ట్ మీటర్లను కవిత పరిశీలించారు. అనంతరం స్మార్ట్ మీటర్లను ప్రజలకు పరిచయం చేయడం, వాటి ఉపయోగాలపై డెమో నిర్వహించడం వెనుక ప్రభుత్వం ప్రజలను ఈ విధానానికి సిద్ధం చేసే ప్రయత్నం చేస్తోందని ఆమె విమర్శించారు. గతంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. ప్రస్తుతం గృహ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను తీసుకురావడం కూడా ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యగా ఆమె అభివర్ణించారు.

## ప్రజావాణిలో 9 దరఖాస్తులు

- ఎంపీడీవో గోపాలకృష్ణ




**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తొమ్మిది దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో గోపాలకృష్ణ తెలిపారు.

**వచ్చిన దరఖాస్తుల వివరాలు:**

MRO కార్యాలయానికి సంబంధించినవి 5
ఎలక్ట్రిసిటీకి సంబంధించినవి 2
మున్సిపాలిటీ, MPDO ఒకటి చొప్పున 2

మొత్తం 9 దరఖాస్తులు వచ్చాయని, ఆయా శాఖలకు పంపిస్తామని, 30 రోజుల్లో ఆ పనులను పూర్తి చేయాల్సి వస్తది అని ఎంపీడీవో గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వేణుగోపాల్, డిటి భాస్కర్ మున్సిపల్ కమిషనర్ షేక్ హయుం ఆప్కారి ఎస్సై మున్సిపాలిటీ సిబ్బంది శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కుట్టు మిషన్ల పంపిణీ పథకానికి దరఖాస్తులు ఆహ్వానం

- ఎంపీడీవో శ్రీనివాస్



**చట్టం జుక్కల్;** బీసీ మహిళలకు కుట్టు వృత్తి ఆధారిత ఉపాధిని ప్రోత్సహించి, కుట్టు వ్యాపారాన్ని విస్తరించేందుకు, ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తెలిపారు ప్రతి నియోజకవర్గానికి 1,000 యూనిట్లు చొప్పున ఒక్కో యూనిట్ విలువ రూ. 12,000/కాగా 100% పూర్తి సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్ అందజేయబడుతుందని అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామాలలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించాలన్నారు

## త్రాగునీటి సౌకర్యం కల్పించి దాహర్తి తీర్చిన స్థానిక గ్రామ సర్పంచ్




**చట్టం రెంజల్ :** రెంజల్ మండలం దూపల్లి గ్రామంలో సోమవారం త్రాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా 11 వార్డు సభ్యుల కోరిక మేరకు తక్షణమే స్పందించిన స్థానిక గ్రామ సర్పంచ్ దానూరి నరసవ్వ అబ్బయ్య నూతన మోటర్ ను బిగించి 11 వార్డ్ కాలనీవాసులకు నీటి ఎద్దడి నివారించి త్రాగునీటి సౌకర్యం కల్పించి కాలనీవాసుల మన్ననాలు పొందారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సర్పంచ్ దానూర్ నరసవ్వ అబ్బయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి వార్డును స్వయంగా పర్యవేక్షణ చేపట్టి సమస్యలను తక్షణమే ఎప్పటికప్పుడు పరిష్కారం చేపడతానని వార్డు సభ్యులకు భరోసా కల్పించారు. త్రాగునీటి ఎద్దడి, పారిశుద్ధ పనులు సమస్యలు తలెత్తినప్పుడు ఎప్పటికప్పుడు వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ కార్యాలయం దృష్టికి చేర్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ దానూరి నరసవ్వ అబ్బయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాలాం, వార్డు సభ్యులు, కాలనీవాసులు, తదితరులు ఉన్నారు.

## మండల స్థాయి ప్రజావాణి కి 14 ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు



**చట్టం రెంజల్ :** రెంజల్ మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో వారణాసి కమలాకర్ వివిధ గ్రామాల 14 ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారుల దృష్టికి చేర్చి సత్వర పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపడతానని ఫిర్యాదుదారులకు భరోసా కల్పించారు. నేటి రోజున కందకుర్తి గ్రామం నుండి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ బిల్లుల నిమిత్తం, రెంజల్ గ్రామం నుండి పంట కాలువ ద్వారా నీటి సరఫరా అయ్యేవిధంగా పూడిక పనులు చేపట్టాలని, ఎంపీ ఓ అధికారికి నీలా గ్రామం నుండి, ఒకటి, రెంజల్ గ్రామం నుండి మూడు, సాటాపూర్ గ్రామం నుండి ఒకటి, తహసిల్దార్ కు కూనేపల్లి గ్రామం నుండి రెండు, రెంజల్ గ్రామం నుండి రెండు, నీలా పేపర్ మిల్ గ్రామం నుండి ఒకటి, బోర్గం గ్రామం నుండి ఒకటి, నీలా గ్రామంలో ఒకటి, ఫిర్యాదులను సంబంధిత అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వారణాసి కమలాకర్, తహసిల్దార్ శ్రవణ్ కుమార్, ఎం పి ఓ గిరిజ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్. సుధాకర్, వెటర్నరీ డాక్టర్ విట్టల్, ఏపీఓ రమణ, హౌసింగ్ ఏఈ సాయికిరణ్, వ్యవసాయ విస్తీర్ణాధికారి ప్రసాద్, ఏపీఎం మోహన్, అధికారులు తదితరులు ఉన్నారు.

## మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టిన బోధన్ ఎమ్మెల్యే




**చట్టం రెంజల్ :** రెంజల్ మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, సుడిగాలి పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా తాహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టి విధులు నిర్వహిస్తున్న అధికారుల పనితీరును ఆరదధీశారు. కార్యాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. భూములు కొనుగోలు చేపట్టే రైతులకు పట్టా మార్పిడిలో భాగంగా ప్రభుత్వ నిబంధనల అనుగుణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని తహసిల్దార్ శ్రావణ్ కుమార్ ను సూచించారు. గ్రామ పంచాయతీలో ఐదు సంవత్సర పైబడి విధులు నిర్వహిస్తున్న కరోబార్ లను బదిలీ ప్రక్రియ చేపట్టాలని ఎంపీ ఓ గిరిజను సూచించారు. బదిలీ చేపట్టిన అధికారులపై తక్షణమే చర్యలు చేపడతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్బిన్ హందాన్, మాజీ ఎంపీపీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, సాయిబాబా గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుర్మే శ్రీను, సాటాపూర్ తాజా మాజీ సర్పంచ్ జావిద్, ఆసాని అనిల్, వీరన్న గుట్ట మాజీ సర్పంచ్ వినోద్, ఆర్మూర్ గంగాధర్ (లడ్డు), ఎంపీడీవో వారణాసి కమలాకర్, తాహసిల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీ ఓ గిరిజ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫాయుమ్, జిపిఓ ఈశ్వర్, కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## సెల్ ఫోన్లు అప్పగింత




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినటువంటి మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులు నాలుగు మందికి 01.అమూల్య శృతి, 02. షేక్ అస్లాం, 03.నీరడి రాజన్న, 04.ఇబ్రహీం సాదా, లకు మొబైల్ ఫోన్లను అప్పగించబడినదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా మూడు సంవత్సర క్రితం రెండు మొబైల్స్, ఒక సంవత్సరం లోపు మూడు మొబైల్స్ లు ఇచ్చినట్లు తెలిపారు.

## ప్రజావాణి ద్వారా సమస్యలు పరిష్కరించుకోండి

- ఎంపీడీఓ శ్రీనివాస్
- ప్రజావాణిలో 3 అప్లికేషన్




**చట్టం జుక్కల్;** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంలోని మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి లో 3 అప్లికేషన్లు వచ్చాయని మండల అధికారి శ్రీనివాస్ తెలిపారు . అధికారి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అధికారులకు రాతపూర్వకంగా ఇవ్వాలని సూచించారు వీలైనంత మేర పరిష్కరిస్తామని చెప్పారు మా పరిధిలో లేని వాటిని జిల్లా అధికారులకు నివేదికలు అందించి వారి సూచనల మేరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు ప్రజావాణి కార్యక్రమానికి జుక్కల్ తాసిల్దార్ మారుతి ఎంపీ ఓ రాము మండల విద్యాధికారి తిరుపతయ్య వెటర్నరీ డాక్టర్ పండరి అటవీశాఖ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్‌జర్లలో 26 నా అంగడి బజార్ ప్రారంభోత్సవం

- గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ వెల్లడి




**చట్టం,షాద్ నగర్ ప్రతినిధి: –** వెల్‌జర్ల గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు తమ పంటలను నేరుగా విక్రయించేందుకు, ప్రజలు నాణ్యమైన కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెల్‌జర్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంగడి బజార్ (కూరగాయల మార్కెట్ -సంత) ఏర్పాటు చేశారు. ఈ సంత ప్రారంభోత్సవం ఈ నెల 26న బుధవారం వెల్‌జర్లలో ఘనంగా నిర్వహించనున్నారు.ఈ సంత ద్వారా వెల్‌జర్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు, కూరగాయల వ్యాపారులు, చిన్న వ్యాపారులు, ప్రజలకు ప్రయోజనం కలగనుంది. రైతులకు స్థానికంగానే మార్కెట్ లభించడంతో పాటు ప్రజలకు కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమానికి గ్రామస్థులు, రైతులు, వ్యాపారులు, మహిళలు, యువత, పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సర్పంచ్ ఆర్. బాబు నాయక్, వార్డు సభ్యులు కోరారు.

## జోగిని పల్లి శ్రీవాసరావు దశదిన కర్మకు హాజరైన ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైద్రాబాద్ లోని కొంపల్లి ఆస్పెషియస్ ఫంక్షన్ హాల్లో సోమవారం రోజు తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, బామర్ది స్వర్గీయ జోగిని పల్లి శ్రీవాసరావు, దశదిన కర్మ కార్యక్రమానికి ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, నూకల శేఖర్, లు పాల్గొని నిజామాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావ్, తో కలిసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు కెసిఆర్ మేనల్లుడు జోగింపల్లి సంతోష్ రావు, మనమడు కెటిఆర్ కుమారుడు హిమాంశు రావు, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, లను మర్యాద పూర్వకంగా కలిసి చర్చించారు.

## నైపుణ్యామే.. స్వయం ఉపాధికి బాట

- యువతిలకు, మహిళలకు సింగరేణి సేవా సమితి ఉచిత శిక్షణ
- దరఖాస్తులకు 31 వరకు అవకాశం




**చట్టం మందమర్రి:** మహిళలు, యువతిలలో నైపుణ్యాలను పెంపొందించి స్వయం ఉపాధి పొందేలా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి విద్యా శిక్షణకు శ్రీకారం చుట్టనున్నారు. మందమర్రి ఏరియా సింగరేణి సంస్థ పరిధిలో ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ తెలిపారు. మూడు నెలలు..మూడు కోర్సులు... టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నారు. అంతేకాక కంప్యూటర్ డీటీపీ (DTP)లో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. వీటిని దరఖాస్తు చేసుకునేందుకు గనుల ద్వారా భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల భార్యలు, వారి పిల్లలు, మందమర్రి ఏరియా సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల భార్యలు, వారి పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. కేకే ఓసీపీ, ఆర్కే ఓసీపీ ప్రాజెక్టుల పరిసర ప్రాంతాలతో పాటు బెల్లంపల్లి, కాసిపేట, సోమగూడెం, మందమర్రి, రామకృష్ణాపూర్ పరిసర ప్రాంత మహిళలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మందమర్రిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో ఉన్న జీఎం పీఏ ఆఫీస్‌లో దరఖాస్తులు సమర్పించాలని, ఈ నెల 31వ తేదీ చివరి గడువు ఉందని పేర్కొన్నారు. అప్లై చేసుకునేవారు దరఖాస్తుతో ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు, పాస్‌ఫొటో జత చేయాలని, సింగరేణి ఉద్యోగి లేదా మాజీ కార్మికుల కుటుంబ సభ్యులైతే సంబంధిత ఐడెంటిటీ కార్డు సమర్పించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 7032878575, 9490940391 చరవాణి నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : విప్ ఆది శ్రీనివాస్

- రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి అత్యంత బాధాకరం



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** చందుర్తి మండలం లింగంపేట గ్రామ పరిధిలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన షాదుల్లా కుటుంబ సభ్యులు వివాహ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రక్త సంబంధీకులు మృతి చెందారు. ప్రమాదంలో షాదుల్లా, ఆయన భార్య హాసీనా, మరో మహిళ హాసీనా, పదో తరగతి చదువుతున్న చిన్నారి మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సోమవారం మృతుల కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించి బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లలో ప్రయాణించే వారు ముందు సీటుతో పాటు వెనుక సీట్లలో ఉన్నప్పటికీ సీట్ బెల్ట్ ధరించాలని కోరారు. వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల భద్రతపై అవగాహన పెంచేందుకు రాష్ట్ర పోలీసు శాఖ 'Arrive Alive' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఇంటి నుంచి బయలుదేరిన ప్రతి ఒక్కరూ తమ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకుని సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని సూచించారు. ఒకే ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆది శ్రీనివాస్ అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను బాధ్యతగా పాటించాలని కోరారు. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించి, వేగ నియంత్రణ పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
మంగళవారం
25.08.2026


## మల్లారెడ్డి మరణం రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు

- **నిరాడంబర కమ్యూనిస్టు నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి గారు**



**చట్టం ఆర్మూర్:** సిపిఎం పార్టీ సీనియర్ నేత, రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు, కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి, మరణం రైతు ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. సోమవారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శాస్త్రినగర్ లో గల సిపిఎం కార్యాలయం వద్ద మల్లారెడ్డి, చిత్రపటానికి పూలమాల వేసిఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఈ రోజు ఉదయం మూడు గంటలకు తుది శ్వాస విడిచారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సంఘం స్థాపనలో కీలక పాత్ర పోషించారని వ్యవసాయ రంగ నిపుణుడిగా నీటిపారుదల రంగంలో నిష్ణాతుడిగా అపార అనుభవం కలిగిన నాయకుడని అనేకమంది రాజకీయ నాయకులు, అధికారులు కూడా ఆయన దగ్గర సలహాలు తీసుకునే వారిని అలాంటి వ్యక్తి మరణించడం బాధాకరమని అన్నారు. ఆయన మృతికి సిపిఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ తరఫున సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు కుతాడి ఎల్లయ్య, టి.భూమన్న, బొర్రా నాగరాజు, యాట కానుకయ్య, నవీద్, ఓంకర్ బామాండ్ల రవి, రాజన్న, కుమార్, పోగుల నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలికంగా ఆటో సమ్మె విరమణ

- **మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు సఫలం..**
- **డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం హామీ: UTUC**



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు చేపట్టిన సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు UTUC అనుబంధ శ్రామిక్ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కటారి రాములు ప్రకటించారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జేఏసీ నాయకులు చర్చలు జరిపినట్లు కటారి రాములు తెలిపారు. సమావేశంలో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వ హామీని గౌరవిస్తూ, ఆటో కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ప్రకటించిన సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ హామీలు ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలవ్యవధిలో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కటారి రాములు కోరారు. హామీల అమలులో నిర్లక్ష్యం లేదా సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులను మరోసారి సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను త్వరగా అమలు చేసి వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రజాస్వామ్యమా పోలీసుల రాజ్యమా..?

- **వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు దేనికి సాంకేతం..**
- **ప్రజా పాలనలో విద్యార్థుల కోసం పోరాటం చేస్తే అక్రమ కేసులు నమోదు చేస్తారా..**
- **వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి..**
- **ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పవన్ చౌహాన్.**



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:**– పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులకు మద్దతుగా పోరాటం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులైన ఆకాష్ శ్రీకాంత్ పై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు ఓవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ చెప్పుకుంటూ పోలీసులతో విద్యార్థి నాయకులపై విద్యార్థి సంఘాల నాయకులు పై అక్రమ కేసులు పెట్టారు దేనికి సాంకేతమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఇది ప్రజాస్వామ్యంమా పోలీసుల రాజ్యమా అని ప్రశ్నించారు విద్యార్థి సంఘాల నాయకులు పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

- **రామకోటి రామరాజు**
- **పోలీసు సంఘం అధ్యక్షుడు సుభాష్ కు ఘన సన్మానం -**
- **భద్రాచల కళ్యాణానికి గోటి తలంబ్రాలు అందించిన ఘనత వీరిది -**



చట్టం సిద్దిపేట (దుబ్బాక) : సిద్దిపేట జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చిందం సుభాష్ ను శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు సోమవారం సీతారాములు ఫొటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృషి, పట్టుదల, నిబద్ధతతో ముందుకు సాగితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు. ఒక బాధ్యతను పొందడం కంటే, ఆ బాధ్యతకు సంపూర్ణ న్యాయం చేస్తూ ప్రజలకు సేవ చేయడమే అసలైన విజయమని పేర్కొన్నారు. చిందం సుభాష్ లో మరో విశిష్టమైన కోణం ఆధ్యాత్మిక భక్తి అని పేర్కొన్నారు. భద్రాచల శ్రీ సీతారాముల కల్యానానికి గోటి తలంబ్రాలు సమర్పించి తన భక్తిని చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, గుజ్జెటి వెంకన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## శివ భక్తులతో కిటకిటలాడిన సిద్ధుల గుట్ట



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎంతో పవిత్ర పుణ్యస్థలమైన శ్రీ నవనాథ సిద్దుల గుట్ట పైన శ్రావణ మాసం రెండవ సోమవారం రోజు శివ భక్తులతో కిటకిటలాడిన సిద్ధుల గుట్ట. భక్తులు ఉదయం నుండి అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో ఆ సిద్దేశ్వరునికి పంచామృతాలతో, బిల్వపత్రాలతో విశేషమైన అభిషేకాలు నిర్వహించారు. అలాగే కొండ పైన గల రామాలయం, దత్తాత్రేయ స్వామి, దుర్గ మాత, అయ్యప్ప స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, సతీమణి ఆశన్న గారి రజిత రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి శివాలయంలో అభిషేకం చేసి, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకి సేవలో పాల్గొన్నారు. ఉదయం నుండి దాదాపు పదివేల మంది పైగా భక్తులు వచ్చారు. శ్రీ నందీశ్వర మహారాజ్, ఆధ్వర్యంలో సిద్దేశ్వరుని పల్లకి సేవ భక్తులు భజన మండలి సభ్యులు భక్తి పాటలు పాడుతూ స్వామి ముందర నృత్యాలు చేస్తూ ఎంతో భక్తి భావంతో ఘనంగా పల్లకి సేవ నిర్వహించారు. నేటి అన్నదాతలు అయిన వినోద్ లహరి, రామకృష్ణ హర్షిని కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికి స్వామివారి అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.సుమన్, పిసి.గంగారెడ్డి, చరణ్ రెడ్డి, కోడిగల మల్లయ్య, జిమ్మీ రవి, కొంతం మంజుల మురళి, అలిశెట్టి నరేష్, బట్టు శంకర్, చందేశి శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్, రామా గౌడ్, సిద్ధుల గుట్ట శివ సమితి భక్తులు, భజన మండలి భక్తులందరూ పాల్గొన్నారు.

## మందు బాబులకు జరిమానా



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో సోమవారం రోజు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి. సత్యనారాయణ గౌడ్, ఆధ్వర్యంలో టౌన్ లో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన 8 మందిని కోర్టులో హాజరు పరచగా 6 గురికి ఒక్కొక్కరికి పదివేల చొప్పున మొత్తం 60000/ రూపాయల జరిమాన, ఇద్దరికీ నాలుగు రోజుల చొప్పున సాధారణ జైలు శిక్ష, జరిమానా హానరబుల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గట్టు గంగాధర్, విధించారని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# వన మహోత్సవం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

- **మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టాలి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** వన మహోత్సవం కింద నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహోత్సవం కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు నాటిన మొక్కలు, ఇంకా నాటాల్సిన మొక్కలు, నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు, జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రస్తుతం అనుకూలమైన వర్షాలు కురుస్తున్నందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రేపు (మంగళవారం) అన్ని జిల్లాల్లో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించి, వన మహోత్సవం లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, ఇతర అనువైన ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. నాటిన ప్రతి మొక్కకు రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు, తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం చేపట్టనున్న వన మహోత్సవం మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన వన మహోత్సవం లక్ష్యంలో మిగిలిన మొక్కల నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలని తెలిపారు. అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాటిన మొక్కల సంరక్షణకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని, జియో ట్యాగింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడి స్వయంప్రకటనపై అభ్యంతరం



**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఫోరం జిల్లా అధ్యక్షులు మునిపల్లి సాయిరెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మునిపల్లి సాయిరెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలోని సర్పంచ్‌లకు, అలాగే జిల్లాలోని 32 మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక వ్యక్తి తానే జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం పూర్తిగా అవాస్తవమని అన్నారు. జిల్లాలోని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులందరి అభిప్రాయాలు, సమన్వయం లేకుండా స్వయంగా జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం సరైన విధానం కాదని ఆయన స్పష్టం చేశారు. 32 మండలాల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులకు ఎలాంటి సమాచారం లేకుండా తీసుకున్న నిర్ణయాలకు గుర్తింపు లేదని తెలిపారు. జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మునిపల్లి సాయిరెడ్డికి జిల్లాలోని అన్ని మండలాల సర్పంచ్‌ల మద్దతు ఉందని ఫోరం ప్రతినిధులు తెలిపారు. జిల్లాలోని 300 మందికి పైగా సర్పంచ్‌లు ఆయనకు అండగా ఉన్నారని, ఫోరం అధ్యక్షుడిగా ఆయనకు తమ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్‌ల ఫోరం నిరంతరం పనిచేస్తోందని మునిపల్లి సాయిరెడ్డి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలు, సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఫోరం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా గ్రామ పంచాయతీల సమస్యలు, సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఫోరం కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. అదేవిధంగా జిల్లాలోని సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి తదితరులు సానుకూలంగా స్పందిస్తున్నారని ఫోరం ప్రతినిధులు తెలిపారు. సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సలహాదారులు సహకరిస్తున్నారని వారు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, సర్పంచ్‌ల హక్కులు, వారి సమస్యల పరిష్కారం కోసం జిల్లా సర్పంచ్‌ల ఫోరం ఐక్యంగా ముందుకు సాగుతుందని మునిపల్లి సాయిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అరికెల జనార్ధన్, ఉపాధ్యక్షులు చింతం ఉమారాణి సంజీవ్, రూరల్ అధ్యక్షులు వాసు, ఇందల్వాయి అధ్యక్షులు సుదర్శన్, రావుట్ల అధ్యక్షులు భూమేశ్, దర్పల్లి అధ్యక్షులు శ్రీను, మోపాల్ అధ్యక్షులు జలేందర్, ఇడపల్లి అధ్యక్షులు రాజు, మోపాల్, బాల్కొండ అధ్యక్షులు మోహన్, మోస్రా అధ్యక్షులు నీలిమా సాయగౌడ్, మెండోరా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు దాదాపు 25 మంది సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా లేదా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుల సమ్మతి లేకుండా ఎవరైనా స్వయంగా జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం సరైన పద్ధతి కాదని, ఇలాంటి ప్రకటనలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని మునిపల్లి సాయిరెడ్డి స్పష్టం చేశారు.

## బురాన్‌పల్లిలో అసంపూర్తిగా అంగన్వాడీ భవనం

- **బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పనులు పూర్తి..**
- **రెండున్నరేళ్లుగా నిలిచిపోయిన మిగతా పనులు**
- **బర్రెలు, మేకలకు స్థావరంగా మారిందని బీఆర్ఎస్ నాయకుడు అనిల్ విమర్శ**





**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా బురాన్‌పల్లి గ్రామపంచాయతీలో నిర్మించిన అంగన్వాడీ భవనం రెండున్నరేళ్లుగా అసంపూర్తిగా ఉండిపోయిందని వికారాబాద్ బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు అనిల్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భవన నిర్మాణ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన కొద్దిపాటి పనులను పూర్తి చేయడంలో ప్రస్తుత ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆరోపించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేగా ఎన్నికై దాదాపు రెండున్నరేళ్లు కావస్తున్నా, ఆయన దత్త గ్రామంగా పేర్కొనే బురాన్‌పల్లిలో అంగన్వాడీ భవనాన్ని పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అనిల్ పేర్కొన్నారు. చిన్నారులకు విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించాల్సిన అంగన్వాడీ భవనం ప్రస్తుతం బర్రెలు, మేకలకు స్థావరంగా మారిందని ఆరోపించారు. ప్రజల అవసరాల కోసం నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండటం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం దాదాపు పూర్తయినప్పటికీ, మిగిలిన పనులను పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అనిల్ విమర్శించారు. సొంత దత్త గ్రామంలోని అంగన్వాడీ భవనాన్నే పూర్తి చేయించలేకపోతే నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధిపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, అంగన్వాడీ భవనానికి మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయించాలని అనిల్ డిమాండ్ చేశారు. చిన్నారులకు భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'ప్రజావాణి'

- **6 అర్జీల స్వీకరణ**




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రోజు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా ఐఏఎస్, ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 6 అర్జీలు వచ్చాయి. శాఖల వారీగా వచ్చిన అర్జీల వివరాలు రెవెన్యూ శాఖ నుండి 04 అర్జీలు, పంచాయతీ రాజ్ శాఖ నుండి 02 అర్జీలు, మొత్తం 06 అర్జీలు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా మాట్లాడుతూ, ప్రజావాణి అర్జీలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు సమస్యలను త్వరగా పరిష్కరించి, ప్రజలకు న్యాయం చేయాలని ఆయన ఆదేశించారు.

## పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదని ప్రజావాణిలో ఫిర్యాదు

- **ఆర్టీఐ నేత చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్**



**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదని ఆర్టీఐ నేత చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ఆరోపించారు. ఈ విషయంపై సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు నిర్ణీత సమయాల్లో కార్యాలయాలకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ పనుల కోసం గ్రామపంచాయతీ కార్యాలయాలకు వచ్చే ప్రజలు కార్యదర్శులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం 2005లో అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన సమాచార బోర్డులు ఏర్పాటు చేయడం లేదని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేసేలా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డుల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలని చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు

- **ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్**




**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సమ్మయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఫిర్యాదు సమర్పించారు. సమ్మయ్య విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, పాఠశాల సమయంలో విద్యార్థులకు పాఠాలు బోధించకుండా వ్యక్తిగత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ రకాల టీచర్ల బిల్లులకు సంబంధించిన పనులతో పాటు తరచుగా ఫోన్‌లో మాట్లాడడం వల్ల విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతోందని ఆరోపించారు. ఆయన బోధించే సబ్జెక్టులో విద్యార్థులు వెనుకబడుతున్నారని, దీనిపై సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ మండల కమిటీ సభ్యులు శ్రీధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బాసరలో బల్గం నాగయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నసమారాధన



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండలంలో సోమవారం మన బలగం నాగయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ నిర్వాహకులు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. బాసర గ్రామంలోని బోర్ర గణేష్ ఆలయంలో అభిషేక కార్యక్రమం నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ట్రస్ట్ గత నెలలో ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు మొదటగా గణపతి గుడి నుండి కార్యక్రమాలు మొదలు పెట్టాలని ఉద్దేశంతో అన్న సమారాధన కార్యక్రమం తో ట్రస్టు సేవలను మొదలుపెట్టామని ట్రస్ట్ అధ్యక్షులు బల్గం పవన్ కుమార్ తెలిపారు. గతంలో వీళ్ళ పూర్వీకులు చేసిన సేవలకు గుర్తించిన అప్పటి అషాబ్ జాహి వంశస్థులు ఇచ్చిన మాన్య పత్రం ఆధారంగా ఈ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు తెలిపారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో బాసర మైలాపూర్ రవీంద్రాపూర్ రత్నాపూర్ గ్రామాల ప్రజలు పాల్గొని ఈ అన్న సమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాఘత్వార్ ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి కూలింటి జగదీశ్వర్ రెడ్డి, ఉప కార్యదర్శి పులి క్రాంతి, కోశాధికారి బేకరీ శ్రవణ్ కుమార్, నెంబర్లు తాళ్లపులి అనిల్ కుమార్ గౌడ్, కాసరి శ్రవణ్ కుమార్, బలగం రాములు జాదవ్, సంజీవ్ పటేల్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోలీసుల అవగాహన సదస్సు

- **డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు హెచ్చరిక**




**చట్టం ఆర్మూర్:** మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పిప్రి రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రోజు విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సత్యనారాయణ గౌడ్, ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ముఖ్యంగా నాలుగు అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. మత్తు పదార్థాల నిర్మూలన, డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాల రవాణా లేదా వినియోగం కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆన్‌లైన్ మోసాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, ఓటీపీ (OTP) షేరింగ్, సోషల్ మీడియా వాడకంలో విద్యార్థిని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమాల పాలన చేయాలని మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

**షీ టీమ్స్ (SHE Teams) రక్షణ:**

బాలికలు, మహిళల రక్షణ కోసం తెలంగాణ పోలీసులు అందిస్తున్న 'షీ టీమ్స్' సేవలను వివరించారు. వేధింపులకు గురైతే భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, షి టీం సభ్యులు విఘ్నేష్, పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లకూడదు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- రూ.7.5 కోట్ల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో మంథనిలో ఆధునిక సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రారంభం
- గంటలో 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం




**చట్టం రామగుండం :** పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని, ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆరోగ్యం, శారీరక ఎదుగుదలతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ.7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో తయారు చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2011లో హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులకు ఆహారం అందించే కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద ఇచ్చిన "10 మైళ్ల పరిధిలో ఒక్కరు కూడా ఆకలితో ఉండకూడదు" అనే సందేశం ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ట్రస్ట్‌తో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఆహార భద్రత కల్పించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో తొలుత కొడంగల్ నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ పథకం అమలుతో కొడంగల్‌లో విద్యార్థుల హాజరు 21 శాతం పెరిగిందన్నారు. ప్రస్తుతం కొడంగల్‌తో పాటు మధిరలో కూడా అల్పాహార పథకం అమలవుతోందని చెప్పారు. సింగరేణి సీఎస్ఆర్ నిధులతో మంథనిలో ఆధునిక యంత్రాలతో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఈ కిచెన్‌లో గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యం ఉందన్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ విభిన్న రకాల అల్పాహారం అందించేలా ప్రత్యేక మెనూ రూపొందించినట్లు తెలిపారు. వారానికి కనీసం మూడు సార్లు పాలు అందించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రతిరోజూ ఒకే రకమైన ఆహారం కాకుండా వివిధ రకాల టిఫిన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అల్పాహారం తీసుకుంటున్న విద్యార్థులతో మంత్రి మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. గతంలో ఆహారం తీసుకోకుండానే పాఠశాలకు రావాల్సిన పరిస్థితి ఉండేదని ఒక విద్యార్థిని చెప్పగా, ఇకపై ఏ విద్యార్థి కూడా అలాంటి పరిస్థితిని ఎదుర్కోకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శారీరక ఎదుగుదల, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అల్పాహార పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలువ పనులతో పంటలు నాశనం చేస్తున్నారంటూ రైతుల ఫిర్యాదు



**చట్టం న్యూస్ వేములవాడ రూరల్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధి లోని కోనాయిపల్లి రైతులు తాము సాగు చేస్తున్న పంటలను నాశనం చేస్తూ కాలువ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు పదేళ్ల క్రితం మర్రిపల్లి గ్రామ చెరువు నుంచి కోనాయిపల్లి గ్రామం వరకు కాలువను తవ్వారు. ప్రస్తుతం కాలువకు తూము నిర్మాణ పనులు చేపడుతున్నారని, అయితే కాలువ ప్రారంభం నుంచి కాకుండా మధ్యలో నుంచి పనులు చేపట్టడం వల్ల సాగు చేస్తున్న పత్తి, వరి, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. తాము సాగు చేస్తున్న పంటలకు ఇంకా సుమారు మూడు నెలల సమయం అవసరముందని, ఈ సమయంలో కాలువ పనులు చేపట్టడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 20 ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు కాలువ నిర్మాణాన్ని ప్రత్యామ్నాయంగా చేపట్టాలని కోరినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాలువ కోసం సర్వే చేసిన భూమిలో కొత్తగా నిర్మించిన భాగాన్ని తొలగించకుండా, పంటలను తొక్కిస్తూ పనులు చేపట్టడం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటోందని రైతులు వాపోయారు. తమకు నష్టం కలగకుండా కాలువ పనులు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి తగిన విచారణ జరిపించి, పంటలకు నష్టం కలగకుండా కాలువ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

## ఏసీబీ వలలో నిర్మల్ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

**రూ: 50 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ టి ఓ జూనియర్ అసిస్టెంట్**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** పన్నులు తగ్గించేందుకు సదురు ఓ వ్యాపారం నుండి రూపాలు 50 వేల లంచం తీసుకుంటూ నిర్మల్ జిల్లా వాణిజ్య పన్ను ల శాఖకు చెందిన డిసిపిఓ. గోదావరి, సీనియర్ అసిస్టెంట్, మంత్రి సాయి కృష్ణ ఏసీబీ అధికారులకు సోమవారం రెడ్ హ్యాండ్ గా పట్టుబడ్డారు. ఈ సందర్భంగా మంచిర్యాల పట్టణానికి చెందిన వ్యాపారి లక్ష్మీ ప్రసన్న జ్యువెలర్స్ కు సంబంధించిన 2023, 2024 ఆర్థిక సమాచార రికార్డులను ఆడిట్లో భాగంగా తమకు అనుకూలమైన నివేదిక ఇచ్చేందుకు మొదట లక్ష రూపాయలు లంచం అడిగినట్లు తెలిసింది. చివరకు 50 వేలకు బేరం కుదరగా వ్యాపారికి నచ్చలేక నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఈ సందర్భంగా వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరుగా వాణిజ్య పనుల శాఖ లో పక్క పకడ్బందీ ప్రణాళికతో వెళ్లి వాణిజ్య పనుల శాఖ కార్యాలయంలోవల వేయగా ఈ క్రమంలో డీసీటీవో గోదావరి సీనియర్ అసిస్టెంట్ మంత్రి సాయి కృష్ణ కలిసి రూపాలు 50వేల లంచం తీసుకున్నగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు ఇద్దరిని ఏసీబీ కోట్లు హాజరు పరిచయం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేసినట్లయితే ధైర్యంగా ఏసేవి కు ఫిర్యాదు చేయాలని డి.ఎస్.పి.జి మధుసూచించారు శ్రీహరి కోసం 9154388963 నెంబర్ తో పాటు టోల్ ఫ్రీ 1064 నంబర్ ను సంప్రదించి అన్యాయ అక్రమాలపై తమను ఆచరించాలని ఎవరిని కూడా భయపడకుండా ముందుకు వచ్చి ఇలాంటి వారిపై చర్యలు తీసుకునే విధంగా మేమున్నామని వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకొనుటకు ఒక అవకాశం



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర గౌరవ రెవెన్యూ మరియు హౌసింగ్ శాఖ మంత్రి ఈ నెల 22న నిర్వహించిన సమావేశంలో ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన 2BHK, ఇందిరమ్మ ఇండ్ల కొరకు గతంలో దరఖాస్తు చేసుకోలేని వారికి మరలా దరఖాస్తు చేసుకొనుటకు ఒక అవకాశం కల్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఇట్టి ఆదేశాలను అనుసరించి జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆర్మూర్ తహసిల్దార్, కార్యాలయం యందు, మునిసిపల్, రెవెన్యూ సిబ్బంది ద్వారా అర్హులైన పేదల నుండి దరఖాస్తులు ఆహ్వానించనైనదనీ ఆర్మూర్ తహశీల్దార్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున ఇదివరకు దరఖాస్తు చేసుకోలేని వారు మాత్రమే రేపటి నుండి అనగా తేదీ 25.8.2026 నుండి 31.08.2026 వరకు ఆర్మూర్ తహసిల్దార్ కార్యాలయం వద్ద దరఖాస్తులు సమర్పించవచ్చును అని తెలిపారు. ఇందుకు కావలసిన పాత్రలు.

ఇట్టి దరఖాస్తుకు జత చేయవలసినవి
1.దరఖాస్తు ఫారం
2.కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు
3.రేషన్ కార్డు/FSC జిరాక్స్.
4.ఓటర్ కార్డు జిరాక్స్.

## ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఆవుల రాజిరెడ్డి



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా కేంద్రంలోని హెచ్ కన్వెన్షన్‌లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కాంగ్రెస్ కార్యకర్తలు చొరవ చూపాలని, అర్హులైన వారి ఓటు హక్కును పరిరక్షించేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ మారం పోచాలు మృతి పట్ల దాసరి ఉషక్క సంతాపం



**చట్టం, పెద్దపల్లి :** ఓదెల మండలం గుండ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మారం పోచాలు మృతి పట్ల BRS నాయకురాలు దాసరి ఉషక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మారం పోచాలు మరణించిన విషయం తెలుసుకున్న వెంటనే దాసరి ఉషక్క వారి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోచాలు మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి, BRS అధ్యక్షుడు కొట్ట మహేందర్, వెలుపుల సదయ్య, అజయ్ స్వేరో, పూలుగు సమ్మిరెడ్డి, వేల్పుల మల్లయ్య, శ్రీధర్, BRS కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## SIR Phase2పై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష



**చట్టం రామగుండం :** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ SIR Phase2 ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో SIR ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు పాల్గొని, SIR Phase2కు సంబంధించిన ప్రక్రియ, పురోగతి మరియు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. SIR ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర పాలక మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ఇంచార్జులు పాల్గొన్నారు..

## చట్టబద్ధంగా, పారదర్శకంగా ఫిర్యాదుల పరిష్కారం

- ప్రజా ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ
- ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



**చట్టం మెదక్ ప్రతినిధి :** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి వినతిదారుడి సమస్యను బాధ్యతగా పరిగణించి, ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

## మిలాద్‌కు.. శాంతి భరోసా

- శాంతి కమిటీ సమావేశంలో ఎస్‌డీపీవో సూచనలు
- ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహణకు పిలుపు



**చట్టం / ఎల్లారెడ్డి :** రాబోయే మిలాద్‌ఉన్‌నబీ పండుగను పురస్కరించుకుని ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డీపీవో శాంతి కమిటీ సభ్యులకు పండుగను ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు పలు సూచనలు, సలహాలు అందించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**చట్టం నారాయణరావుపేట :** నారాయణరావుపేట మండలంలోని, జక్కపూర్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాట్ల రాజు ఆధ్వర్యంలో గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులకు నోచుకోని నిరుపేద కుటుంబాలకు నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో అర్హులు స్మార్ట్ రేషన్ కార్డులను అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ఆరు కిలోల సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ ఉందన్నారు. ఒకనాడు రేషన్ బియ్యం ఇస్తే చాలామంది ప్రజలు తినే పరిస్థితి లేకుండా అని, నేడు మాత్రం ప్రతి ఒక్కరు సంతోషంతో తింటున్నారని అన్నారు. ఈ రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు నిరుగొండ స్రవంతి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంబటి విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



**చట్టం, బోథ్ :** ఇటీవల నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను సోమవారం బోథ్ మండల బిఆర్ఎస్ నాయకులు వల్లని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అధ్యక్షులుగా దాసరి పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి వంశీ, సలహాదారులుగా సాయిని గంగాధర్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు స్వామి, మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, అడ్వకేట్ పాంద్రం శంకర్, బోథ్ బీ ఆర్ ఎస్ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, సురేందర్ యాదవ్, సర్పంచ్ లు రూప్చంద్, విశ్వేష్, సంజీవ్, రవి, రాజు, రవీందర్, మాజీ సర్పంచ్ లు కుమ్మరి రమణ, గంగమల్లు, ఇఫ్తేకర్, అమృత్, నారాయణ ఉప సర్పంచ్ రాజేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువత మేలుకో.. డ్రగ్స్‌కు బానిస కావద్దు

- డీఎస్పీ అరుణ్ కుమార్
- డ్రగ్స్ మహమ్మారిని అరికట్టి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి: బండారు శరత్ బాబు



**చట్టం, భద్రాది కొత్తగూడెం ప్రతినిధి :** యువత, విద్యార్థులు డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ బానిస కావద్దని డీఎస్పీ అరుణ్ కుమార్ సూచించారు. భద్రాచలం జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ భద్రాచల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ భద్రాచల పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి డీఎస్పీ అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ మొదట సరదాగా లేదా స్నేహితుల ఒత్తిడితో ప్రారంభమైనప్పటికీ, క్రమంగా తీవ్రమైన వ్యసనంగా మారే ప్రమాదం ఉందన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యం, చదువు, ఉద్యోగ అవకాశాలు, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ విక్రయించే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినప్పుడు పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు. విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. 4వ వార్డు మెంబర్, ఎస్ఎఫ్ఐ పట్టణ ఇంచార్జ్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చదువు అత్యంత ముఖ్యమని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను వెలికి తీయాలని సూచించారు. యువత దేశానికి ప్రధాన శక్తి అని, అలాంటి యువత డ్రగ్స్‌కు బానిసైతే సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని శరత్ బాబు అన్నారు. డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ప్రభుత్వం, విద్యాశాఖ, పోలీసు శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఎస్ఎఫ్ఐ భద్రాచల పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు తాము డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతో పాటు తోటి విద్యార్థులను కూడా చైతన్యపరచాలని కోరారు. విద్యాసంస్థలు, కళాశాలలు, హాస్టళ్లు, యువత ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. డ్రగ్స్ వ్యాప్తికి కారణాలను గుర్తించి అరికట్టేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాఖీ వేళ సింగరేణి కార్మికులకు ఆత్మీయ పలకరింపు

- ఆర్జీ-1 గనుల వద్ద కార్మికులకు రాఖీలు కట్టిన కందుల సంధ్యారాణి
- కార్మికులకు స్వీట్లు తినిపించి రాఖీ శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ శ్రేణులు
- అన్నా–చెల్లెలు, అక్క–తమ్ముళ్ల అనుబంధానికి రాఖీ ప్రతీక: కందుల సంధ్యారాణి



**చట్టం, రామగుండం :** అన్నా-చెల్లెలు, అక్క-తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి బీజేపీ శ్రేణులతో కలిసి గోదావరిఖనిలోని ఆర్జీ1 సింగరేణి గనుల వద్ద కార్మికులను ఆత్మీయంగా పలకరించారు. గనుల్లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికుల చేతులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికులతో ముచ్చటించి వారి క్షేమ సమాచారంతో పాటు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ కుటుంబంలో ఎన్ని చిన్నచిన్న విభేదాలు ఉన్నప్పటికీ రాఖీ పండుగ రోజున అన్నా-చెల్లెలు, అక్క-తమ్ముళ్లు ప్రేమాభిమానాలతో ఒక్కటవుతారని తెలిపారు. సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆత్మీయత, అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులతో ఆత్మీయతను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. సింగరేణి కార్మికుల మధ్య ఐకమత్యం, సోదరభావం ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. సింగరేణి కార్మికులు తమ శ్రమను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, కోదూరి రమేష్, బియ్యాల మహేందర్, పాకాల నరసింహారెడ్డి, బూడిద హర్ష, కొట్టే నరేష్, శ్రీనివాస్, చింతం అంజి, గంగరాజు, ఎల్తూరి సరితరాజయ్య, మీస వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## PRTU TS నారాయణరావుపేట మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక




**చట్టం, నారాయణరావుపేట :** నారాయణరావుపేట మండల కేంద్రంలో PRTU TS మండల శాఖ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాత మండల కార్యవర్గాన్ని రద్దు చేసి, నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం వివరాలు:**

మండల అధ్యక్షుడిగా ఎర్రవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి. నాజిం బాబా, మండల అసోసియేట్ అధ్యక్షుడిగా జి. శ్రీనివాస్ రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా డి. శోభారాణి, ఉపాధ్యక్షుడిగా ఇ. మధుకర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎ. కళ్యాణి, కార్యదర్శిగా కె. చంద్రశేఖర్, మహిళా కార్యదర్శిగా కె. మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి PRTU TS సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మల్లు ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాశుపల్లి శశిధర్ శర్మ అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, సంఘ బలోపేతం కోసం నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. "ఐక్యతే మన బలం.. ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం" అనే నినాదంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

# సెప్టెంబర్ చివరి నాటికి వన మహోత్సవ లక్ష్యాలు పూర్తి చేయాలి

- మంత్రి కొండా సురేఖ
- ఆగస్టు 25న జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కల నాటే కార్యక్రమాలు
- మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మెదక్ జిల్లాలో 31.95 లక్షల లక్ష్యానికి 19,43,654 మొక్కలు నాటి 60.83 శాతం పూర్తి






**చట్టం న్యూస్, మెదక్ ప్రతినిధి :** వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం వన మహోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఎఫ్‌వో జోజి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఆగస్టు 25న అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలకు అవకాశం ఉన్న నేపథ్యంలో అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకొని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని తెలిపారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి మొక్కల నాటే కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు తెలిపారు.

**మొక్కల మనుగడపై నిరంతర పర్యవేక్షణ**

మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయడంతో పాటు మొక్కల మనుగడను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని సూచించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే ఎంపిక చేయాలని, అవసరమైన ప్రాంతాలకు మొక్కలను సకాలంలో తరలించాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ పార్కులను ప్రోత్సహించాలని సూచించారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని తెలిపారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

**మెదక్ జిల్లాలో 60.83 శాతం లక్ష్యం పూర్తి**

కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో వన మహోత్సవం కింద 31 లక్షల 95 వేల మొక్కలు నాటాలని లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు 19 లక్షల 43 వేల 654 మొక్కలు నాటి 60.83 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. మంత్రి సూచనల మేరకు ఆగస్టు 25న జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో సామూహిక మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేసి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎఫ్‌వో జోజి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల కోసం రోబో తయారు చేస్తున్న సుజన్‌కు అభినందనలు



**చట్టం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ రూరల్: రైతులకు ఉపయోగపడేలా ప్రత్యేక రోబోను రూపొందిస్తున్న వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన లక్కం సుజన్ ప్రతిభ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. నిరుపేద కుటుంబానికి చెందిన లక్కం సుజన్, నరసయ్య కుమారుడు. రైతుల కష్టాలను తగ్గించాలనే ఉద్దేశంతో, "రైతే రాజు కావాలి" అనే సంకల్పంతో వ్యవసాయ పనులకు ఉపయోగపడే రోబో తయారీపై కృషి చేస్తున్నాడు. తాను రూపొందిస్తున్న రోబోకు సంబంధించిన నమూనా, పనితీరు వివరాలను కంప్యూటర్ ద్వారా వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్‌కు సుజన్ వివరించాడు. సుజన్ ప్రతిభను అభినందించిన ప్రభుత్వ విప్, భవిష్యత్తులో రైతులకు ఉపయోగపడే ఇలాంటి సాంకేతిక పరికరాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. రోబో తయారీకి అవసరమైన సహాయం ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, సాధ్యమైన సహకారం అందిస్తామని సుజన్‌కు భరోసా ఇచ్చారు. సుజన్ తన ప్రతిభతో బాలరాజుపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ నేదురి ప్రేమలత, నరసయ్యతో పాటు గ్రామస్తులు ఆకాంక్షించారు. రైతుల కోసం వినూత్న ఆలోచనతో ముందుకు సాగుతున్న సుజన్ భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలు చేయాలని పలువురు అభినందించారు.

# ప్రజల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి

- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్
- ప్రజావాణిలో 27 దరఖాస్తుల స్వీకరణ



**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 27 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టి, పరిష్కరించిన వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్న నేపథ్యంలో అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, వినతులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీకి పక్కా భవనం నిర్మించాలి

- కలెక్టర్‌కు కౌన్సిలర్ జ్యోతి సురేష్ వినతి




**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించాలని 14వ వార్డు కౌన్సిలర్ మంచన్‌పల్లి జ్యోతి సురేష్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న అద్దె భవనం ఇరుకుగా ఉండటంతో చిన్నారులతో పాటు గర్భిణీలు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వార్డు పరిధిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలంలో అంగన్వాడీకి సొంత భవనం నిర్మించాలని కోరారు. అనంతరం జిల్లా మహిళా సంక్షేమ అధికారి (DWO) కాంతారావును కలిసి సమస్యను వివరించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జ్యోతి సురేష్ మాట్లాడుతూ, అద్దె భవనంలో సరైన వసతులు లేకపోవడంతో పిల్లలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో పక్కా భవనం నిర్మిస్తే అంగన్వాడీ కేంద్రానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జ్యోతి సురేష్ తెలిపారు.

# "ఫీజుల బకాయి బిజెపి లడాయి" దీక్షలో పాల్గొన్న బైరి శంకర్ ముదిరాజ్




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిజెపి అధ్యక్షులు రాంచందర్ రావు చేపట్టిన 2 రోజుల నిరాహార దీక్షలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ఆగం చేస్తూ రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విద్యార్థి లోకం వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్తారన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం ఇకనైనా ఆపి ఫీజుల బకాయిలను కాంగ్రెస్ సర్కార్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొడుపునూరి వెంకటేశం, తాటికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మిషన్ గ్రామానికి చేరింది



**చట్టం నారాయణరావుపేట :** ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.3,67,500 విలువైన మిషన్‌ను గ్రామానికి తీసుకురావడంలో ప్రస్తుత సర్పంచ్ బొంగురం ఎల్లారెడ్డి చొరవ చూపారని గ్రామస్థులు తెలిపారు. గత పాలకవర్గం హయాంలో గ్రామానికి మిషన్‌ను తీసుకొస్తామని ప్రకటించినప్పటికీ, నిధుల వినియోగంపై వివాదాలు తలెత్తడంతో అది గ్రామానికి చేరకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం బొంగురం ఎల్లారెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులను సంప్రదించడంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వరుస ప్రయత్నాల ఫలితంగా రూ.3.67 లక్షల విలువైన మిషన్‌ను నారాయణరావుపేట గ్రామానికి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఐదేళ్లుగా పరిష్కారం కాని సమస్యకు ప్రస్తుత పాలకవర్గం చొరవతో పరిష్కారం లభించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులపై నిరంతరం దృష్టి సారిస్తామని సర్పంచ్ బొంగురం ఎల్లారెడ్డి తెలిపారు. నారాయణరావుపేట గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఎక్కడ?.. నిరుద్యోగ యువతకు ఉపాధి ఎప్పుడు?

- బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ ప్రశ్న



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ ఎస్సీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ డిమాండ్ చేశారు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కార్లు, ట్రాక్టర్లు, త్రీ వీలర్లు తదితర వాహనాల కొనుగోలుకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం అందించేవారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లకు పైగా గడిచినా ఎస్సీ నిరుద్యోగ యువతకు ఆశించిన స్థాయిలో స్వయం ఉపాధి పథకాలు అమలు కావడం లేదని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం పేరుతో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి అమలుపై స్పష్టత లేకపోవడంతో నిరుద్యోగ యువత నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఎలక్ట్రిక్ టూ వీలర్లు, త్రీ వీలర్లు అందిస్తామని మరోసారి దరఖాస్తులు స్వీకరించినా, లబ్ధిదారులకు వాహనాల పంపిణీ ఎప్పుడు జరుగుతుందనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదన్నారు. సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు ఎస్సీ నిరుద్యోగ యువతకు ఒక్క వాహనం కూడా అందలేదని ఉమేష్ ఆరోపించారు. ప్రభుత్వం ఈ అంశంపై తక్షణమే స్పందించి ఎస్సీ కార్పొరేషన్‌కు అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. కార్లు, ట్రాక్టర్లు, త్రీ వీలర్లు తదితర స్వయం ఉపాధి యూనిట్ల కోసం కొత్తగా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించాలని, అర్హులైన ఎస్సీ నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని పుల్లూరు ఉమేష్ ప్రభుత్వాన్ని కోరారు.

# జిల్లా పోలీస్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం




- ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్

**చట్టం, మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల నోడల్ అధికారి అదనపు ఎస్పీ, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, రామకృష్ణ పర్యవేక్షణలో ఎన్నికలు సజావుగా కొనసాగాయి. ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించి, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. జిల్లా పరిధిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా అభిలాష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా ఆర్ఎస్ఐ నరేష్, కోశాధికారిగా విజయ్, సంయుక్త కార్యదర్శిగా రాము ఎన్నికయ్యారు. సంఘం ఎక్స్‌అఫిషియో సభ్యులుగా సాజిద్ అలీ, సతీష్, విజయ్ కుమార్, గంగామణి, నర్సింలు, రేణుక ఎన్నికయ్యారు. కోఆప్షన్ సభ్యులుగా గోపాల్, భాగ్యలక్ష్మి ఎంపికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు. పోలీస్ అధికారుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# అక్రమంగా ఇంటిలోకి ప్రవేశించి దొంగతనం చేసిన వ్యక్తికి జైలుశిక్ష



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఇంటిలో ఎవరులేని సమయంలో అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి అక్రమంగా ఇంటిలోకి ప్రవేశించి, దొంగతనం చేసిన దాసరి అనిల్, కు రెండు నేరాలలో రెండు సంవత్సరాల చొప్పున జైలుశిక్షను విధిస్తూ ఆర్మూర్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సరళ రాణి, సోమవారం రోజు తీర్పు చెప్పారని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని రామ్ నగర్ లో నివాసముండే బొంకూరి శ్రీధర్, తన భార్య కమల కుమారి, ఆరోగ్యం బాగా లేనందున నిజామాబాద్ నగరంలోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో 2025, డిసెంబర్ 23న చేర్పించారు. వారు ఆసుపత్రిలోనే ఉండటం మూలంగా ఇంటికి తిరిగి రాలేదు. ఇంటి యాజమాని చారి, శ్రీధర్ కు కిరాయికి ఇచ్చిన పోర్షన్ ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం చూసి సమాచారం ఇచ్చాడు. ఇంటికి వచ్చిన శ్రీధర్, ఇంటిలో పల ఇంటి వస్తువులు చిందరవందరగా పడి ఉండటం బీరువా పగులగొట్టి అందులో దాచిన బంగారు, వెండి ఆభరణాలు దాదాపు లక్ష రూపాయల విలువ గలవి దొంగతనంకు గురి అయినట్లు బావించి ఆర్మూర్ పట్టణ పోలీసులకు పిర్యాదు చేశారు. నేర విచారణ చేసిన పోలీసులు నేరానికి పాల్పడింది రామ్ నగర్ కు చెందిన దాసరి అనిల్, గా గుర్తించి అరెస్ట్ చేసి నేరం ఒప్పుకోలు పంచానామా, ఇతర సాక్ష్యాలతో కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. నేర న్యాయ విచారణలో భాగంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాక్షులను కోర్ట్ లో ప్రవేశపెట్టి నేర నిరూపణ చేయడంతో అనిల్ పై దొంగతనం, ఇంటిలోకి దొంగతనం చేయాలనే ఉద్దేశంతో ప్రవేశించిన నేరాలలో నేర నిరూపణ నిర్ధారణ అయినట్లు దొంగతనం నేరానికి గాను రెండు సంవత్సరాల సాదారణ జైలుశిక్ష, దొంగతనం చేయాడానికి ఇంటిలోకి ప్రవేశించినందున రెండు సంవత్సరాల జైలుశిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించారని, రెండు శిక్షలు ఏక కాలంలో అనుభవించాలని జడ్జి తమ తీర్పులో వ్రాసినట్లు ఎపిపి రామకృష్ణ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలోనీ పోలీసుల బృందాన్ని అభినందించారు.

# భూముల రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్
- తహసీల్దార్లతో సమీక్ష సమావేశం




**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** జిల్లాలో చేపడుతున్న భూముల రీ సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం రీ సర్వే పనుల పురోగతిపై తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా రీ సర్వే ప్రక్రియ, భూ రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి సర్వే పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రీ సర్వే సమయంలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. తహసీల్దార్లు తమ మండలాల పరిధిలో రీ సర్వే పనుల ప్రస్తుత పరిస్థితి, పూర్తయిన సర్వేలు, పెండింగ్ అంశాల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. సర్వే ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యం ఇస్తూ భూ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సభలను నిర్వహించి ప్రజలకు రీ సర్వేపై అవగాహన కల్పించడంతో పాటు పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి, డీఆర్ఓ స్వర్ణలత, ఆర్డీఓ వాసు చంద్ర, డిప్యూటీ కలెక్టర్ పూజ, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ మధుసూదన్, అన్ని మండలాల తహసీల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి బస్టాండ్‌లో బంగారం చోరీ!

- ఇద్దరు మహిళల మెడల్లో 3 తులాల ఆభరణాలు మాయం
- ఫిర్యాదులపై కేసులు.. నిందితుల కోసం పోలీసుల దర్యాప్తు



**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఎస్ఐ రాజు తెలిపారు. శనివారం సాయంత్రం జరిగిన రెండు ఘటనల్లో సుమారు 3 తులాల బంగారు గుండ్లు అపహరణకు గురయ్యాయని పేర్కొన్నారు. లింగంపేట్ మండలం భవానీపేట్ గ్రామానికి చెందిన నాగులూరి సుశీల తమ గ్రామానికి వెళ్లేందుకు బస్సు ఎక్కిన అనంతరం మెడలోని సుమారు 1.5 తులాల బంగారు గుండ్లు కనిపించకపోవడాన్ని గుర్తించారు. మరో ఘటనలో ఎల్లారెడ్డి మండలం సోమర్‌పేట్ గ్రామానికి చెందిన కుసులకంటి దీవెన బాన్సువాడ వెళ్లేందుకు బస్సు ఎక్కిన అనంతరం తన మెడలోని మరో 1.5 తులాల బంగారు గుండ్లు కనిపించలేదని గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలను చోరీ చేసినట్లు ఇద్దరు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి, చోరీలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** శ్రీ సరస్వతీ విద్యాపీఠం సిద్దిపేట ఆధ్వర్యంలో రెండు రోజులపాటు విభాగ్ స్థాయి గణిత విజ్ఞానమేల 2026 నిర్వహించడం జరిగింది ఈ మేళాలో సైన్స్ ప్రదర్శనలు గణితం ప్రదర్శనలు సైన్స్ క్విజ్ పోటీలు గణితం క్విజ్ పోటీలు పత్ర సమర్పణలు ఎక్స్పరిమెంట్స్ కాంపిటీషన్ కథను పోటీ ఉపన్యాస పోటీ మట్టి నమూనాల తయారీ పోటీ మొదలగు పోటీలను కిశోర వర్గ, బాలవర్గ మరియు శిశు వర్గ స్థాయిలలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మెటీరియల్ సైన్సు సైంటిస్ట్ డాక్టర్ కె శ్రీశైలం పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్యభట్ట చాణక్యుడు వరాహిమి వీరుడు వంటి గొప్ప శాస్త్రవేత్తలుగా మీరు తయారవ్వాలని అబ్దుల్ కలాం ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమం ముగింపులో సిద్దిపేట మండల విద్యాశాఖ అధికారి రాజా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మహాభారతంలోని అర్జునుడు ప్రతి విద్యార్థికి ఆదర్శంగా తీసుకోవాలి మరియు అర్జునుడి వల్ల ద్రోణాచారుడికి ఏ విధంగా అయితే పేరు వచ్చిందో విద్యార్థులు ఎదిగినట్లయితే మీకు బోధించేటువంటి టీచర్లకు కూడా ప్రపంచ ప్రఖ్యాతి వస్తుంది అని అన్నారు. ప్రతి విద్యార్థి నిత్య అభ్యాసం నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు జిల్లాల నుండి 16 పాఠశాలలు పాల్గొన్నాయి. మొత్తం 300 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అత్యధికంగా మొదటి బహుమతులు సిద్దిపేట కైవసం చేసుకోగా రెండో స్థానంలో కోరుట్ల నిలిచింది. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, కాటం రవీందర్, వైకుంఠం, శేఖరం, సాంబశివరావు, శ్రీనివాస్ రావు మరియు ప్రధాన ఆచార్యులు ఆచార్యులు విద్యార్థుల బృందం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి కె వైద్యం అందించే దుస్థితి కి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

- నేను పోను సర్కార్ దవాఖాన ను అనే రోజులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం..
- సిద్దిపేట ఆసుపత్రి వైద్య సేవల పై మండి పడ్డ బి ఆర్ ఎస్ నేతలు...



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో మందికి ఉచిత వైద్య సేవలు అందించిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రినీ.... ఆసుపత్రికే వైద్యం అందించాల్సిన దుస్థితికి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు పాల సాయిరాం మండిపడ్డారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యం అందడం లేదని..... నేను రాను బిడ్డో సర్కారు దావకానకు అనే రోజులు మళ్లీ వచ్చాయన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితి అధ్వాన్నంగా మారిందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వారికి కుట్లు వేసేందుకు దారం కూడా ఆస్పత్రిలో ఉండడం లేదని..... బయట మెడికల్ షాప్లలో కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. జిల్లా మెడికల్ అడ్వైజరీ కమిటీ మీటింగ్లో మాజీ మంత్రి హరీష్‌రావు పలుమార్లు వైద్యశాఖ అధికారులను హెచ్చరించినప్పటికీ వారిలో ఇప్పటికీ మార్పు లేదన్నారు. సరైన సమయంలో వైద్యం అందక రోగులు చనిపోయిన సందర్భాలు కూడా ఇటీవల చూస్తున్నామన్నారు. ఎక్రే పరికరాలు, స్కానింగ్, ల్యాబ్ పరికరాలు ఏవి పనిచేయడం లేదని..... ఆసుపత్రికి వచ్చిన రోగులను ప్రైవేటు ఆసుపత్రికి పంపించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాన్ని మెరుగుపరచాలని లేనిపక్షంలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్, మాజీ కౌన్సిలర్లు మోహిజ్, సాయి ఈశ్వర్ గౌడ్, నాయకులు పాపయ్య, నవీన్, హరీష్ పలువురు పాల్గొన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# ఉద్యోగాల జాతర.. యువతకు వరం!

- ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీ జాబ్‌మేళా
- 10 వేల మందికిపైగా యువత.. 80 ప్రముఖ కంపెనీలు
- 1,246 మందికి అక్కడికక్కడే ఉద్యోగ ఆఫర్లు



**చట్టం / ఎల్లారెడ్డి :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆధ్వర్యంలోని మదన్ మోహన్ ట్రస్ట్ నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన లభించింది. సోమవారం నియోజకవర్గ చరిత్రలోనే అతిపెద్ద స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి 10 వేల మందికిపైగా ఉద్యోగార్థులు హాజరయ్యారు. అమెజాన్, శామ్‌సంగ్, జియో, డాక్టర్ రెడ్డీస్, టాటా, ఎయిర్‌టెల్, ఎన్‌ఐఐటీ, శ్రీసారం ఫైనాన్స్, ఎల్‌ఐసీ తదితర 80 ప్రముఖ సంస్థలు పాల్గొని ఐటీ, ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మెడికల్, ఏవియేషన్, నాన్‌ఐటీ తదితర రంగాల్లో అవకాశాలు కల్పించాయి. వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియ అనంతరం 1,246 మంది అభ్యర్థులకు స్పాట్ జాబ్ ఆఫర్లు లభించాయి. సొంత నియోజకవర్గంలోనే ప్రముఖ కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకురావడంపై యువత హర్షం వ్యక్తం చేసింది. ఉపాధి.. నైపుణ్యం.. స్వయం సాధికారత దిశగా జాబ్‌మేళా కొత్త ఆశలు నింపిందని నిర్వాహకులు తెలిపారు.

# నిఖిలేశ్వరానంద పాఠశాలను సీజ్ చేయాలి

- నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐపీఎస్‌యూ డిమాండ్



**చట్టం న్యూస్, సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిఖిలేశ్వరానంద పాఠశాల ప్రభుత్వ అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తూ, విద్యార్థుల అడ్మిషన్లు చేపడుతోందని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) ఆరోపించింది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాఠశాలను సీజ్ చేసి, నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐపీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మన్నె కుమార్ మాట్లాడుతూ పాఠశాలకు షిఫ్టింగ్ పర్మిషన్, ఫైర్ సేఫ్టీ అనుమతులు, ఆట స్థలం, పార్కింగ్ సౌకర్యం వంటి అవసరమైన వసతులు లేవని ఆరోపించారు. పదో తరగతి నిర్వహణకు అవసరమైన అనుమతులు కూడా లేవని, అయినప్పటికీ అడ్మిషన్లు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇతర పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నిఖిలేశ్వరానంద పాఠశాలలో చేరాలని ఫోన్ల ద్వారా, ప్రత్యక్షంగా సంప్రదిస్తూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. పాఠశాల ప్రధాన రహదారి మూల మలుపు వద్ద ఉండటం విద్యార్థుల భద్రతకు సమస్యగా మారే అవకాశం ఉందని మన్నె కుమార్ పేర్కొన్నారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో తరగతులు నిర్వహించాల్సి ఉండగా పై అంతస్తుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు పాఠశాల అనుమతులు, భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలపై తక్షణమే తనిఖీలు నిర్వహించాలని ఏఐపీఎస్‌యూ కోరింది. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తున్నట్లు తేలితే సీజ్ చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అధికారులు స్పందించకపోతే ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని మన్నె కుమార్ హెచ్చరించారు.

# ఎంపిడిఓ కార్యాలయంలో ప్రజావాణి

- 4 అర్జీల స్వీకరణ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ డెవలప్మెంట్ కార్యాలయంలో సోమవారం రోజు మండల స్థాయి అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10:00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి 23 మంది మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన 4 ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. శాఖల వారీగా వచ్చిన అర్జీల వివరాలు పంచాయతీ రాజ్ శాఖ నుండి 01 అర్జీ, మున్సిపల్ శాఖ ఆర్మూర్ 02 అర్జీలు, విద్యాశాఖ 01 అర్జీ, మొత్తం 04 అర్జీలు. ప్రభుత్వ ఉత్తర్వుల G.O.Ms.No.04, Date: 04.08.2026, ప్రకారం ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు మండల కార్యాలయంలో ఈ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలే శివాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ తహశీల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సత్యనారాయణ గౌడ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: జేఏసీ



**చట్టం, శంకరపట్నం :** ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆటో రవాణా రంగ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఆటోలను అనుసంధానించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఆటో మీటర్ చార్జీలను కూడా అందుకు అనుగుణంగా పెంచాలని తెలిపారు. ఓలా, ఉబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆటో రవాణా రంగంపై ప్రభావం చూపుతున్న బైక్ టాక్సీ సేవలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రతి సంవత్సరం రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం మండల ఆటో యూనియన్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకరి కిషోర్, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, నాయకులు చంద్రమౌళి, దేవునూరి రాజు, ప్రశాంత్, శ్రీకాంత్, అనిల్, రవి, శ్రీను, వెంకటేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# తల్లికి తల కొరివి పెట్టిన కూతురు



**చట్టం ప్రతినిధి కామారెడ్డి;** అనాదిగా వస్తున్న ఆచారాన్ని కాదని కొడుకులు లేరనే కొరత లేకుండా తల్లికి కూతురే తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు అడ్లూర్ ఎస్సీ కాలనీకి చెందిన పెరుమాండ్ల రాజమణి అనే మహిళ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఆమెకు భూమవ్వ ఒక్కతే కుమార్తె కావడంతో తల్లికి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించింది. మారుతున్న కాలంలో ఇలాంటి ఘటనలు సమాజంలో మార్పుకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రజావాణికి వినతుల వెల్లువ.. 10 ఫిర్యాదుల స్వీకరణ

- శంకరపట్నం ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు




**చట్టం, శంకరపట్నం :** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం శంకరపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 10 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనిత, తహసీల్దార్ సురేఖ, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ నెల 30న జరగనున్న నీట్(పీజీ)2026 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఈ నెల 30వ తేదీన జరగనున్న నీట్ (పీజీ)-2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం



**చట్టం /హనుమకొండ ;** ఈ నెల 30న జరగనున్న నీట్ (పీజీ)2026 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 30వ తేదీన జరగనున్న నీట్ (పీజీ) 2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ఎన్ టి ఏ నీట్ (పీజీ)2026 కంప్యూటర్ బేస్డ్ పరీక్ష ఈ నెల 30వ తేదీ (ఆదివారం)న ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్ష నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ (తిరుమల్ రెడ్డి కన్వెన్షన్ హాల్ ఎదురుగా, హైవే పక్కన హసన్ పర్తి), మోక్షిత్ కంప్యూటర్స్ ( పొద్దుటూరు గార్డెన్స్( రామారం, కరీంనగర్ రోడ్డు), అయాన్ డిజిటల్ జోన్ (ఫిల్టర్ బెడ్, వడ్డేపల్లి )కేంద్రాలలో జరుగుతుందన్నారు. ఈ పరీక్ష నిర్వహణలో ముగ్గురు అధికారులను పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుగా, ఒకరిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా, ముగ్గురిని సిట్టింగ్ స్క్వాడ్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. పరీక్ష దృష్ట్యా కేంద్రాలలో తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్ష ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు ఉదయం 8:30 తరువాత పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులకు అనుమతి ఉండదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్త్ ఉండాలన్నారు. పరీక్ష జరుగుతున్న దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిసిపి దార కవిత, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీ శంకర్, ఎన్పీడీసీఎల్ ఏఈ అలేఖ్య, ఎస్బీ ఇన్స్పెక్టర్ రాజు , ఫ్లయింగ్,సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు, ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మీలాద్‌ఉన్‌నబీ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా రామగుండం కమిషనరేట్‌లో పీస్ కమిటీ సమావేశం ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి.. సోషల్ మీడియా పుకార్లపై కఠిన చర్యలు



**చట్టం, రామగుండం :** మీలాద్‌ఉన్‌నబీ (ఈద్‌ఎమిలాద్) పండుగను ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. పండుగ నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు. జులూసులు, ర్యాలీలు నిర్వహించే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, నిర్ణయించిన మార్గాల్లోనే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు స్వచ్ఛంద సేవకులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అధిక శబ్దం కలిగించే సౌండ్ సిస్టమ్‌లు, డీజేలు, ఇతర పరికరాలను నిబంధనలకు విరుద్ధంగా ఉపయోగించరాదని స్పష్టం చేశారు. చిన్నారులు, వృద్ధులు, విద్యార్థులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసే ప్రసంగాలు, పాటలు, నినాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. అన్ని మతాలు, వర్గాల మనోభావాలను గౌరవిస్తూ యువత శాంతి, క్రమశిక్షణతో వ్యవహరించాలని కోరారు. గొడవలు, వివాదాలకు దూరంగా ఉండటంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పండుగ కార్యక్రమాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా వేడుకలు నిర్వహించాలని సీపీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగ సందర్భంగా అవసరమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, పుకార్లు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే పోస్టుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమాచారం నిజమా కాదా అనే సందేహం ఉంటే స్థానిక పోలీసులను సంప్రదించి నిర్ధారించుకోవాలని కోరారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే డయల్ 112, రామగుండం కమిషనరేట్ కంట్రోల్ రూమ్ 8712656597 లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని తెలిపారు. సోషల్ మీడియాలో మత ఘర్షణలకు దారితీసేలా అసత్య ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలు పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవంతో మీలాద్‌ఉన్‌నబీ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అంబర్ కిషోర్ ఝా కోరారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, రామగుండం సీఐ కృష్ణ కుమార్, బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఆర్ఐ రమేష్, పెద్దపల్లి ఎస్ఐ నరేష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ చంద్రశేఖర్, చెన్నూర్ టౌన్ ఎస్ఐ శ్యామ్ పటేల్, మత పెద్దలు పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేసి శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి

- యుఎస్ఎఫ్ఐ
- సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా
- రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు డిమాండ్




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన శక్తి పాలసీతో పాటు టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను విలీనం చేస్తూ జారీ చేసిన జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ విద్యార్థులు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జీవో 97కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్లాపురం మధు మాట్లాడుతూ, సాంకేతిక విద్యా వ్యవస్థను శక్తి పాలసీలో విలీనం చేసి ఐటీఐలతో అనుసంధానం చేయడం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ కళాశాలల స్వయం ప్రతిపత్తిని కాపాడాల్సిన అవసరం ఉందని, సాంకేతిక విద్యను కేవలం మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కార్మిక శక్తిని తయారు చేసే వ్యవస్థగా మార్చే విధానాలు సరైనవి కావని పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా జీవో 97ను తీసుకువచ్చారని ఆరోపించారు. జీవో నంబర్ 97ను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి (ఎస్‌బీటెట్)ను స్వతంత్ర వ్యవస్థగా కొనసాగించి, పాలిటెక్నిక్ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే పాలిటెక్నిక్ విద్యార్థులను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని చంద్లాపురం మధు హెచ్చరించారు. ఈ ధర్నాలో యుఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నాచారం శేఖర్, జిల్లా కార్యదర్శి గుడికందుల రవి, జిల్లా నాయకులు వినయ్, రాకేష్, హేమంత్, పెద్ద సంఖ్యలో పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ దీపక్ తివారి



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే ప్రభుత్వ లక్ష్యంతో సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులకు సంబంధించి మొత్తం 109 దరఖాస్తులను అధికారులకు సమర్పించారు. పెన్షన్లు, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలాల్లోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానికంగా నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటాచారి, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్ఓ స్వర్ణలత, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల యూనియన్‌కు నూతన కార్యవర్గం

- ఎల్లారెడ్డి డివిజన్ TVEU H-82 నూతన బాడీ ఎన్నిక
- అధ్యక్షుడిగా కొలిమి రాజు.. కార్యదర్శిగా ఎండీ హాఫీజుద్దీన్

**చట్టం / ఎల్లారెడ్డి :** విద్యుత్ ఉద్యోగుల TVEU H82 యూనియన్ ఎల్లారెడ్డి డివిజన్ నూతన కార్యవర్గాన్ని కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి. హరికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, రాజాగౌడ్, శ్యామాగౌడ్, రాజు, సాయిలు, హాజీ రియాజ్, పోచాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. డివిజన్ అధ్యక్షుడిగా కొలిమి రాజు, కార్యదర్శిగా ఎండీ హాఫీజుద్దీన్ (రియాజ్), వైస్ ప్రెసిడెంట్లుగా పోచాగౌడ్, ఏ. శ్రీనివాస్, బి. సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె. హాజీ, క్యాషియర్‌గా శశికాంత్ ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎం. భూపాల్‌రెడ్డి, పి. నవీన్‌కుమార్, ఎండీ షాబోద్దీన్, జాయింట్ కార్యదర్శులుగా శివకుమార్, డి. సతీష్, పి. నవీన్‌కుమార్ (సీఎల్), సోషల్ మీడియా బాధ్యతలకు అరుణ్‌గౌడ్, ప్రేమ్ (సీఎల్), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జగతి రాజేశ్వర్, అరుణ్ (సీఎల్), ఎండీ రియాద్ (సీఎల్) ను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గం విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా ఎస్పీ ఎం. రాజేశ్ చంద్ర, ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు కె. రంజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులు బి. సంతోష్ కుమార్, పి.ఎన్. సాయి ప్రసన్న, ప్రధాన కార్యదర్శి తులా శ్రీధర్, సంయుక్త కార్యదర్శి కె. మధుకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎల్. శ్రీనివాస్, కోశాధికారి ఎస్. సాయిలు తదితర కార్యవర్గ సభ్యులు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ అధికారుల సంక్షేమం, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పనిచేయాలని, శాఖలో ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ విక్టర్



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం IDOC లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసారి మొత్తం 65 ఫిర్యాదులు అందాయి. ప్రజలు తమ భూ సమస్యలు, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిబంధనల ప్రకారం పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆయన సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి అర్హత ఉన్న వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, జిల్లా పరిషత్ సీఈఓ చందర్, డీఆర్ఓ పాండు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కూతురు పుట్టిన రోజు పాఠశాలకు కుర్చీలు వితరణ



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలో కీర్గల్ ( కె ) గ్రామంలో సోమవారం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కానిస్టేబుల్ రాజు, కూతురు సాక్షర పుట్టినరోజు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పాఠశాలలోని, తమ కూతురు పుట్టినరోజును కేక్‌లు కట్ చేస్తూ, ఆడంబరంగా జరుపుకోవడం ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ రాజు మాట్లాడుతూ... గతంలో కూడా నేను ఈ పాఠశాలలో చదివి ఈరోజు మంచి ఉద్యోగం సాధించినందుకు పాఠశాలకు జ్ఞాపకార్థం విద్యార్థులు నేలపై కూర్చుకొండ కుర్చీలో కూర్చోవాలని సదుద్దేశంతో కుర్చీలను బహుకరించడం జరిగిందని తెలిపారు. ఈనాటి యువతకు అలవాటు. అయితే, దానికి భిన్నంగా ఆలోచించిన ఒక యువకుడు తన కూతురు పుట్టినరోజు శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఉపయోగపడే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు. పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూర్చోవడానికి సరిపడా కుర్చీలు (చైర్స్) లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న సదరు కానిస్టేబుల్ , తన సొంత ఖర్చులతో కొత్త కుర్చీలను కొనుగోలు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ప్రిన్సిపల్ రావళిక, భవాని ను అందించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఆ కుర్చీలను అందజేశారు. హంగూ ఆర్భాటాలకు అనవసరంగా డబ్బు వృథా చేసేకంటే, మన ఊరి బడిలోని పిల్లలకు సౌకర్యాలు కల్పించడం ఎంతో తృప్తినిచ్చింది. యువత తమ జీవితంలో ఇలాంటి చిన్న చిన్న మంచి పనులు చేయడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చు అని పేర్కొన్నాడు. పాఠశాల ఉపాధ్యాయులు మరియు స్థానికులు ఆ కానిస్టేబుల్ ని ఔదార్యాన్ని, సామాజిక బాధ్యతను కొనియాడారు. పుట్టినరోజున పాఠశాలకు అవసరమైన వస్తువులను బహుమతిగా ఇవ్వడం తోటి యువతకు ఆదర్శంగా నిలిచిందని గ్రామస్తులు ఉపాధ్యాయులు స్నేహితులు బంధువులు పలువురు కానిస్టేబుల్ రాజు అభినందిస్తూ వారికి ఆదర్శంగా నిలుస్తూ పాఠశాలలో మరిన్ని మౌలిక సదుపాయాల కోసం ముందుకు రావాలని ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్ గా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు బాధ్యతల స్వీకరణ



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** తెలంగాణ శాసనసభ మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్ గా జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు సోమవారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణతో పాటు సర్వతోముఖాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన తోట లక్ష్మీకాంతారావుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
మంగళవారం
25.08.2026



# అర్హులైన ఓట్లు తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలి

- బూత్ స్థాయి ఏజెంట్లు మరింత క్రియాశీలకంగా పని చేయాలి
- వలస వెళ్లిన ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- సిద్దిపేట నామినేటెడ్ పోస్టుల ఖాళీలపై పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఆరా



**చట్టం – సిద్ధిపేట ప్రతినిధి :** ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో సిద్ధిపేట నియోజకవర్గానికి చెందిన అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. మెదక్‌లో జరిగిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి సిద్ధిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై నేతలు ప్రత్యేకంగా చర్చించారు. బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు మరింత క్రియాశీలకంగా పని చేసి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా పరిశీలించాలని సూచించారు. ఉపాధి కోసం ఇతర గ్రామాలు, పట్టణాలకు వలస వెళ్లిన వారు, పేదలు, బలహీన వర్గాలకు చెందిన ఓటర్లు తమ ఓటు హక్కు కోల్పోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో తప్పులు ఉంటే వాటిని గుర్తించి సరిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అదేవిధంగా సిద్ధిపేట నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టుల వివరాలను పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు త్వరగా కల్పించే అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల స్పందన ఎలా ఉందన్న విషయాన్ని స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. ఈ సమావేశంలో సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పూజల హరికృష్ణ స్థానిక పరిస్థితులు, నామినేటెడ్ పోస్టుల ఖాళీలకు సంబంధించిన వివరాలను కమిటీ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు రషద్, విజయ దానియల్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఎక్కిన రైలు ఇంజిన్.. రోడ్డెక్కిన రైలు పవర్ ఇంజిన్



**చట్టం ఆర్మూర్:** పట్టాలపై పరుగులు తీయాల్సిన రైలు ఇంజిన్, లారీ ఎక్కి రోడ్డెక్కిన వింత ఘటన జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంది. బెంగళూరు నుండి ఛత్తీస్‌గఢ్ కు ఒక భారీ లారీపై సరికొత్త రైలు ఇంజిన్‌ను రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో, 44వ నంబర్ జాతీయ రహదారిపై నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామం వద్ద ఆదివారం ఈ భారీ వాహనాన్ని కొద్దిసేపు రోడ్డు పక్కన నిలిపారు. రోడ్డుపై వెళ్తున్న ప్రజలు ఈ అరుదైన దృశ్యాన్ని చూసి ఎంతో ఆసక్తిగా తిలకించారు. కొందరు వాహనదారులు, స్థానికులు అక్కడ ఆగి తమ చరవాణిలో సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.

## మిలాద్ఉన్‌నబీ వేడుకలకు పటిష్ట బందోబస్తు

- ఐదు జిల్లాల పోలీసు అధికారులతో సన్‌ప్రీత్ సింగ్ వీడియో కాన్ఫరెన్స్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మిలాద్ఉన్‌నబీ వేడుకలను శాంతియుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని జోన్III ఇన్‌చార్జ్ డీఐజీ, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ సూచించారు. ఈ నెల 26న జరగనున్న మిలాద్ఉన్‌నబీ వేడుకల నేపథ్యంలో కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాల పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేడుకల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ర్యాలీల నిర్వహణ, ముందస్తు భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మిలాద్ఉన్‌నబీ ర్యాలీలు సాగే మార్గాల్లో విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ర్యాలీ మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందస్తుగా పరిశీలించి క్లియరెన్స్ చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక పెద్దలు, సమాజ ప్రముఖులతో సమన్వయం చేసుకుంటూ ప్రశాంత వాతావరణం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమాజంలో ద్వేషాన్ని పెంచే, విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు లేదా చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా ఆందోళనలు, నిరసన కార్యక్రమాల సమయంలో బందోబస్తులో ఉండే పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యంతో, ఓపికతో, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతర నిఘా కొనసాగించాలని, శాంతిభద్రతలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. మిలాద్ఉన్‌నబీ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని స్థాయిల పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సన్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు.

## ధర్మారావుపేటలో వీధికుక్కల బీభత్సం.. ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** సదాశివనగర్ మండలం ధర్మారావుపేట గ్రామంలో వీధికుక్కలు రెచ్చిపోయాయి. పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న ఇద్దరు పిల్లలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాల నుంచి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఒక్కసారిగా దూసుకొచ్చిన వీధికుక్క ఇద్దరు పిల్లలపై దాడి చేసి కరిచింది. పిల్లల కేకలు విన్న తల్లిదండ్రులు, స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని కుక్కను తరిమికొట్టారు. తీవ్ర గాయాలపాలైన పిల్లలను కుటుంబ సభ్యులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇటీవల జిల్లాలో వీధికుక్కల దాడులు పెరిగిపోయాయి. బాన్సువాడలో వీధికుక్క దాడి చేసి 20 మందికి పైగా గాయపరిచిన ఘటన మరువకముందే తాజా ఘటన చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలను బయటకు పంపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వీధికుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతున్నా మున్సిపల్, పంచాయతీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యం – ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో వన్ టు వన్ సమావేశం



**చట్టం / పరకాల ;** ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, భువనగిరి SIR1 కోఆర్డినేటర్ ఇ.వి. శ్రీనివాస్ రావు వన్ టు వన్ సమావేశంలో SIR1 ఫీడ్‌బ్యాక్‌తో పాటు పార్టీ సంస్థాగత నిర్మాణం, క్షేత్రస్థాయి పరిస్థితులు, కార్యకర్తల సమన్వయం, పార్టీ కార్యక్రమాల అమలు మరియు భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. భువనగిరి శాసనసభ నియోజకవర్గం SIR 1 కోఆర్డినేటర్‌గా క్షేత్రస్థాయిలో నిర్వహించిన కార్యక్రమాలు, ఎదురైన పరిస్థితులు, కార్యకర్తలతో సమన్వయం మరియు ప్రజల నుంచి లభించిన ఫీడ్‌బ్యాక్‌ను ఇ.వి. శ్రీనివాస్ రావు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కి వివరించారు. ఈ సందర్భంగా పార్టీని మరింత బలోపేతం చేస్తూ, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం కల్పించడం, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై సానుకూలంగా అభిప్రాయాలు పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసి, క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు సమిష్టి కృషితో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దుతూ, కార్యకర్తల భాగస్వామ్యంతో ప్రజలకు మరింత చేరువయ్యేలా భవిష్యత్ కార్యాచరణను కొనసాగించాలని సమావేశంలో చర్చించారు.

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం




**చట్టం /పరకాల ;** పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిధిలో 2026 27 విద్యా సంవత్సరంకు గాను అతిథి అధ్యాపక నియామకం కోసం ఒక ప్రకటన విడుదల చేశారు ఈ విద్య సంవత్సరం కు గాను సంస్కృతం ఒక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ నందు 55% మార్కులు ఎస్సీ మరియు ఎస్టీలకు 50% మార్కులు కలిగి ఉండాలని మరియు నెట్ లేదా సెట్ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోగా కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని ఇంటర్వ్యూ తేదీని దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ ద్వారా తెలియజేస్తామని తెలిపారు.

## గందె సత్యానందంను పరామర్శించిన నాగూర్ల వెంకటేశ్వర్లు



**చట్టం /పరకాల;** పరకాల పట్టణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు తండ్రి గందె సత్యానందం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద హైటెక్ సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను సంప్రదించి గందె సత్యానందం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య చికిత్సపై వివరాలు తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. గందె సత్యానందం త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు నాగూర్ల వెంకటేశ్వర్లు తెలిపారు.

## దివ్యాంగ పిల్లలు తయారు చేసిన రాఖీలకు ఆదరణ.. IDOCలో ప్రత్యేక స్టాల్

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** బిక్కనూర్ మండలంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రం (NHC) లోని మానసిక వికలాంగ (MR) విభాగం పిల్లలు తయారు చేసిన చేతి రాఖీలకు విశేష ఆదరణ లభించింది. మానసిక దివ్యాంగులకు చిన్న చిన్న నైపుణ్య శిక్షణలు ఇవ్వడంలో భాగంగా పిల్లలు 250 రాఖీలను వివిధ డిజైన్లలో ఆకర్షణీయంగా తయారు చేశారు. వాటి విక్రయం కోసం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం IDOC వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ ను అదనపు కలెక్టర్లు (రెవెన్యూ, లోకల్ బాడీస్), డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్డీఓ కె.పి. విజయలక్ష్మి, జిల్లా అధికారులు, డీపీఎంలు సందర్శించారు. రాఖీలు తయారు చేసిన పిల్లలను అదనపు కలెక్టర్లు మనస్ఫూర్తిగా అభినందించారు. జిల్లా అధికారులంతా రాఖీలు కొనుగోలు చేసి పిల్లలను ప్రోత్సహించారు. అనంతరం NHC పిల్లలు అదనపు కలెక్టర్లకు, డీఆర్డీఓకు, జిల్లా అధికారులకు స్వయంగా తయారు చేసిన రాఖీలు కట్టి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాలంటూ గ్రామస్తుల ఆరోపణ

- రూ.50 వేలు ఇస్తేనే ఇల్లు మంజూరు చేస్తున్నారంటూ ఆవేదన
- ఇళ్లు ఉన్నవారికే లబ్ధి.. అసలైన అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆరోపణ



**చట్టం రామాయంపేట :** మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియపై పలువురు గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. సొంత ఇల్లు లేని నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటికే ఇళ్లు ఉన్న కొందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలంటే రూ.50 వేల వరకు డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని, డబ్బులు ఇవ్వలేని నిజమైన అర్హులకు అవకాశం దక్కడం లేదని కొందరు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇల్లు లేని కుటుంబాలు పలుమార్లు అధికారులను సంప్రదించినా తమ పేర్లను పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో సిఫారసుల ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని, అర్హత కంటే ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్న వ్యక్తులకు కూడా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగిందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, గ్రామంలో ఆ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్రపై కూడా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి మంజూరైనట్లు తేలితే బిల్లులను నిలిపివేసి, నిజమైన అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా రూ.50 వేల చెల్లింపులకు సంబంధించిన ఆరోపణలపై కూడా విచారణ జరిపి, నిజానిజాలు వెలికితీయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల వివరణ తెలియాల్సి ఉంది

## ఓటరు జాబితా సవరణతో ప్రతి బూత్‌ను బలోపేతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు



**చట్టం /పరకాల;** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో దశలో భాగంగా ప్రతి బూత్‌ను రాజకీయంగా, సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ రావు అమరేందర్ రెడ్డి, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు డా. సిరంగి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. పరకాల స్వర్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన పరకాల అసెంబ్లీ నియోజకవర్గ ఎస్ఐఆర్ రెండో దశ కార్యశాలలో పరకాల పట్టణం, పరకాల రూరల్, నడికూడ, దామెర, ఆత్మకూరు మండలాలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో దశ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. నమోదు పత్రాలను సక్రమంగా నింపని వారిని గుర్తించి, అవసరమైన గుర్తింపు పత్రాలతో వాటిని పూర్తి చేయించి సమర్పించేలా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా ఓటరు జాబితాను నిరంతరం పరిశీలించాలని, అనర్హమైన మరియు నకిలీ ఓట్లను గుర్తించి తొలగించేలా సమగ్ర పరిశీలన చేపట్టాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ అధ్యక్షులే పార్టీకి పట్టుకొమ్మలని పేర్కొంటూ, బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసినప్పుడే రాజకీయంగా విజయాలు సాధ్యమవుతాయని నాయకులు అన్నారు. ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియను కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్.పీ. జయంతిలాల్, దేవునూరి మేఘనాథ్, పరకాల కౌన్సిలర్లు బెజ్జంకి పునాచారి, ఆకుల లావణ్య శ్రీధర్, మండల అధ్యక్షులు కాసగాని రాజ్‌కుమార్, ఉప్పుగల శ్రీకాంత్‌రెడ్డి, వేల్పుల రాజ్‌కుమార్, మాజీ చైర్‌పర్సన్ మార్త రాజభద్రయ్య మోర్చాల నాయకులు, మండల ప్రధాన కార్యదర్శులు, బూత్ అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంస్థాగత ప్రాంగణాల భద్రతకు ప్రత్యేక చర్యలు

- కామారెడ్డిలో కలెక్టరేట్ కీలక నిర్ణయాలు




**( చట్టం ప్రతినిధి కామారెడ్డి )** జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, క్రీడా సముదాయాలు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వీధికుక్కల బెడద నివారణకు జిల్లా సంస్థాగత ప్రాంగణాల భద్రతా కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పర్యవేక్షణలో, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి కన్వీనర్ గా కమిటీ పనిచేయనుంది. సోమవారం జరిగిన సమీక్షలో అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ వీధికుక్కల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**కమిటీ తీసుకున్న నిర్ణయాలు:**

1. ప్రాంగణాల్లోకి కుక్కలు రాకుండా చర్యలు: అన్ని సంస్థాగత ప్రాంగణాల్లో గేట్లు, ప్రహరీ గోడలు, చెత్త నిర్వహణ ప్రాంతాలను పటిష్టంగా నిర్వహించాలి. నోడల్ అధికారులను నియమించి కుక్కల ప్రవేశం, దాడుల వివరాలు నమోదు చేయాలి.
2. మున్సిపాలిటీలు, పంచాయతీల బాధ్యత: వీధికుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్, మానవీయ నిర్వహణ చర్యలను స్థానిక సంస్థలు చేపట్టాలి.
3. పశుసంవర్ధక శాఖ సమన్వయం: స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కు సాంకేతిక మార్గదర్శకత్వం ఇవ్వడంతో పాటు నివేదికలు సమర్పించాలి.
4. వ్యాక్సిన్ అందుబాటు: అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ARV), రేబిస్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ (RIG) తగినంతగా అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు.
5. అవగాహన, నెలవారీ సమీక్ష: విద్యార్థులు, సిబ్బంది, ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కమిటీ నెలకు ఒకసారి సమీక్ష నిర్వహించి అమలు తీరును పరిశీలిస్తుంది. కుక్క కాటు వేసిన వెంటనే గాయాన్ని సబ్బుతో కడిగి, ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలని, రేబిస్ లక్షణాలు వచ్చాక ప్రమాదకరమని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ‘జీవితాంతం చదువు చెప్పిన చేతులతో.. పల్లీల బుట్ట మోస్తున్నా!’

- ఎల్బీ స్టేడియంలో వినూత్న నిరసన తెలిపిన కామారెడ్డి ఎస్జీటీ ఉపాధ్యాయుడు దామోదరరావు



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** సీపీఎస్ విధానం వల్ల భవిష్యత్తులో ఉపాధ్యాయుల పరిస్థితి ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్లు చూపిస్తూ కామారెడ్డి జిల్లా ఉపాధ్యాయుడు చేసిన వినూత్న నిరసన ఎల్బీ స్టేడియంలో అందరి దృష్టిని ఆకర్షించింది. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని కోరుతూ ఆదివారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన జన జాగరణ సభలో లింగంపేట మండలం ఐలాపూర్ కు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు బి. దామోదరరావు వినూత్న వేషధారణతో నిరసన తెలిపారు. ఆయన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కాదు. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుడే. అయితే సీపీఎస్ ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత ఎదురయ్యే దయనీయ పరిస్థితిని ప్రతిబింబించేందుకు రిటైర్డ్ ఉద్యోగి వేషంలో వచ్చారు. నెత్తిన రుమాలు, చేతిలో పల్లీల బుట్ట, పేపర్లతో తిరుగుతూ.. మెడలో ప్లకార్డు ధరించారు.

> B. DAMODARA RAO, Retired CPS Employee (SGT)
> Last Basic pay : ₹91,000
> Pension : ₹4,200

అంటూ.. రూ.91 వేల జీతం తీసుకునే ఉద్యోగికి రిటైర్మెంట్ తర్వాత కేవలం రూ.4,200 పెన్షన్ వస్తే ఎలా బతకాలని ఆయన సింబాలిక్ గా చూపించారు. "ఇప్పటికైనా ఓపీఎస్ కోసం పోరాడకపోతే రేపు మనందరి పరిస్థితి రోడ్డున పల్లీలు అమ్ముకునే దుస్థితికి దిగజారుతుంది" అంటూ తోటి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఫీజుల బకాయి బీజేపీ లడాయి




**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట మండల కేంద్రంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఫీజుల బకాయి బీజేపీ లడాయి కార్యక్రమం నిర్వహించారు, ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ మాట్లాడుతు పెండింగ్ లో ఉన్న ఫీజు రియాంబర్స్ మెంట్ ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు లింగంపేట మండల బీజేపీ ఆధ్వర్యంలో ఫీజుల బకాయి బీజేపీ లడాయి కార్యక్రమం నిర్వహించమన్నారు. ఈసందర్భంగా డా.BR అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని విద్యా సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్ బకాయిలు చెల్లించడం లేదని సుమారు 1500 కోట్ల రూపాయల ఫీజు రివంబర్ మెంట్స్ ని బాకీ లో ఉంచడం సరికాదన్నారు. ఫీజు పెండింగ్ వలన విద్యార్థులు ఫీజులు కట్టలేక ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, చాలామంది విద్యార్థులు పేద మధ్య తరగతి వారు విద్యను అభ్యసించడం మానేసి ఇళ్ల వద్ద కూలీలుగా కూలీ పనులు చేసుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడకుండా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు గ రెండు రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నారని వారికి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని లింగంపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయడం జరిగిందని అంబేద్కర్ రాజ్యాంగంలో ఇచ్చినటువంటి విద్యా హక్కును కాలరాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలను అగమ్య గోచరంగా మారుస్తూ వారితో చెలగాటమాడుతుంటే బిజెపి చూస్తూ ఊరుకోదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఫీజు రివంబర్ మెంట్స్ బకాయిలను విడుదల చేయకుంటే బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వాన్ని గద్దదించే విధంగా విద్యార్థులను కదిలించి ఉద్యమాన్ని చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తున్నమన్నారు.

## అధిక యూరియా వాడకం పంటకు చేటు.. సమగ్ర పోషకాలతోనే మంచి దిగుబడి

- రైతులకు మానవ శరీరం ఉదాహరణతో అవగాహన కల్పించిన వ్యవసాయ నిపుణుడు సంతోష్
- మొక్కల ఆరోగ్యకర ఎదుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం



**చట్టం నారాయణఖేడ్ :** సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని బీమ్రా రెవెన్యూ గ్రామంలో సోమవారం రైతులకు “పత్తి పంటలో సమగ్ర పోషక యాజమాన్యం”పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ నిపుణుడు సంతోష్ రైతులకు పంటల్లో పోషకాల ప్రాధాన్యతను వివరించారు. ప్రస్తుతం సులభంగా లభించడం, తక్కువ ధర కారణంగా రైతులు పత్తి పంటలో అధిక మోతాదులో యూరియా వినియోగిస్తున్నారని తెలిపారు. అవసరానికి మించి నత్రజని వినియోగించడం వల్ల మొక్కలు బలహీనపడటంతో పాటు పురుగులు, తెగుళ్ల ప్రభావం పెరిగే అవకాశం ఉందని వివరించారు. కేవలం ఒకే రకమైన ఎరువుపై ఆధారపడకుండా పంటకు అవసరమైన అన్ని పోషకాలను సమతుల్యంగా అందించాలని సూచించారు.

**మానవ శరీరం ఉదాహరణతో వివరణ**

రైతులకు సులభంగా అర్థమయ్యేలా మానవ శరీరానికి అవసరమైన పోషకాలతో మొక్కల పోషకాలను పోల్చి వివరించారు. మనిషి శరీరంలో ఎముకలు దృఢంగా ఉండటానికి క్యాల్షియం, శరీర ఆరోగ్యానికి వివిధ విటమిన్లు ఎలా అవసరమవుతాయో, అదే విధంగా మొక్కలు ఆరోగ్యంగా ఎదగడానికి 16 రకాల ముఖ్య పోషక మూలకాలు అవసరమవుతాయని తెలిపారు. పంట ఎదుగుదలలో ప్రతి దశకు వేర్వేరు పోషకాల అవసరం ఉంటుందని వివరించారు. వేరు వ్యవస్థ బలపడటానికి భాస్వరం కీలకమని, మొక్క ఎదుగుదలకు తగిన మోతాదులో నత్రజని అవసరమని తెలిపారు. పూత, కాత పటిష్టంగా ఉండేందుకు పొటాషియం, బోరాన్‌తో పాటు ఇతర సూక్ష్మ పోషకాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పంటకు ఏ దశలో ఏ పోషకం అవసరమో గుర్తించి సమగ్ర పోషక యాజమాన్యాన్ని పాటిస్తే నాణ్యమైన దిగుబడితో పాటు రైతులకు అధిక నికర లాభాలు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. మట్టి పరీక్ష నివేదికల ఆధారంగా అవసరమైన మోతాదులోనే ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell :9948884497. prasadsirigada27@gmail.com

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## నీళ్ల ఎత్తిపోతపై నిర్ణయం సర్కార్‌దే!




**చట్టం, హైదరాబాద్ :** కేసీఆర్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఎన్డీఎస్ఏ (జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ) బట్టబయలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నిపుణులైన ఇంజినీర్లు ఉన్నందున కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపాలా? దిగువకు పంపించాలా? వద్దా? అనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపరమైన నిర్ణయమని తేల్చిచెప్పింది. హైకోర్టులో న్యాయవాది శరత్ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి సంబంధించి దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ (ప్రమాణపత్రం)లో ఎన్డీఎస్ఏ పలు కీలక విషయాలను వెల్లడించింది. న్యాయవాది శరత్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సాంకేతికంగా అనూహ్యమైన సహకారం అందించామని ఎన్డీఎస్ఏ వివరించింది. విధాన తీవ్రంగా ఆక్షేపించింది. విధాన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవాలే గాని ఎన్డీఎస్ఏ కానేకాదని తేల్చిచెప్పింది. ముఖ్యంగా మేడిగడ్డ వద్ద ఒక పిల్లర్ కుంగుబాటు నేపథ్యంలో రిజర్వాయర్లో నీటిని తోడివేయాలని లేదా నీటిని నింపవద్దని ఆదేశించడం ఎన్డీఎస్ఏ బాధ్యత కాదని స్పష్టంచేసింది. ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు జరిగేలా చూడటం పూర్తిగా విధాన నిర్ణయమని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసినట్టు పేర్కొన్నది. ఆ నిర్ణయం తీసుకునే పూర్తి స్వేచ్ఛ, అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉన్నదని తేల్చిచెప్పింది. ఈ మేరకు తాను ఒక రైతు హోదాలో హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్లో ఎన్డీఎస్ఏ తరఫున సభ్య కార్యదర్శి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారని సీనియర్ న్యాయవాది శరత్ కుమార్ తెలియజేశారు.

## ‘బడేభాయ్’ బన్‌గయా విలన్.. మోదీపై ప్లేటు ఫిరాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- **అమెరికా పర్యటన ఆగిపోవడంతో ఆరోపణలు**
- **గుజరాత్ కుట్రలు ఇప్పుడు గుర్తుకొచ్చాయా?**
- **బీజేపీతో అంటకాగినప్పుడు అనిపించలేదా?**
- **ఢిల్లీలో పదులసార్లు కలిసినప్పుడు కనిపించలేదా!**
- **బడే భాయ్.. చోటే భాయ్ అన్నప్పుడు ఏమైంది?**



**చట్టం, హైదరాబాద్:** నిన్నటి వరకు బీజేపీతో అంటకాగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తత్వం బోధపడినట్టున్నది. అవసరం ఉన్నా లేకపోయినా, సందర్భమైనా కాకపోయినా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్రమోదీని పొగిడిన సీఎం.. ఇప్పుడు ప్లేటు ఫిరాయించారు. ప్రధానిపై తిట్ల దండకం మొదలుపెట్టారు. తన పథకాలకు, పాలనకు గుజరాత్ రాష్ట్రమే స్ఫూర్తి అంటూ డబ్బాకొట్టిన రేవంత్.. ఇప్పుడు ‘గుజరాత్ కుట్రలు’ అంటూ ఊగిపోతున్నారు. దీనంతటికీ సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడమే ప్రధాన కారణం. సోమవారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ బీజేపీని, నరేంద్రమోదీని, గుజరాత్‌ను నిందించారు. 76 సార్లు ఢిల్లీకి వెళ్లి పదుల సందర్భాల్లో ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిసి, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో విందులు చేసుకొన్న వ్యక్తి.. ఇప్పుడు వారిపైనే చిందులు వేయడం మొదలుపెట్టారు. 2023 డిసెంబర్‌లో అధికారం చేపట్టింది మొదలు.. నిన్న మొన్నటివరకు తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ సమైక్య పాలన సాగుతున్నట్టుగా నడిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అకస్మాత్తుగా ప్లేటు ఫిరాయించి.. గుజరాత్ మాడల్‌ను దూషించడం, మోదీని విమర్శించడంపై రాజకీయ వర్గాల్లో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రెండున్నరేండ్లు బీజేపీకి బాకా**

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటినుంచి కేంద్ర ప్రభుత్వానికి ‘జీ హుజూర్’ అన్నట్టుగా వ్యవహరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యతగా లేకపోవడం వల్ల రాష్ట్రానికి నిధులు రాలేదని ఆరోపించారు. కేంద్రంతో ఎలా ఉండాలో తనకు తెలుసంటూ బీరాలు పలికారు. మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటేనే నిధులు వస్తాయని అందరినీ నమ్మించే ప్రయత్నం చేశారు. ప్రతి సభలోనూ బీజేపీకి, ప్రధాని మోదీకి బాకా ఊదారు. ఏకంగా మోదీని ‘బడే భాయ్’ అంటూ ఆకాశానికి ఎత్తేసిన సంగతి తెలిసిందే. 2024 మార్చి 4న ఆదిలాబాద్‌లో జరిగిన సభకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఇదే వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి మోదీని ‘బడే భాయ్’ అంటూ సంబోధించారు. ‘గుజరాత్ తరహాలో తెలంగాణ కూడా అభివృద్ధి చెందాలి’ అని ఆకాంక్షించారు. గుజరాత్‌కు ఇచ్చినట్టే తెలంగాణకు కూడా నిధులు ఇవ్వాలని, దీనికి ప్రధాని నరేంద్ర మోదీ సహకారం అవసరమని వ్యాఖ్యానించారు. ‘వికసిత్ భారత్‌లో భాగస్వాములం అవుతాం’ అని ప్రకటించారు. ఓ సందర్భంలో తన పాలనకు మోదీయే స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంలో ప్రధాని హైదరాబాద్‌కు వచ్చి, సికింద్రాబాద్ మహంకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆనాటి వీడియోను మోదీ ట్వీట్ చేయగా, సీఎం రేవంత్‌రెడ్డి రీట్వీట్ చేస్తూ ప్రధానిపై తన భక్తిభావాన్ని చాటుకున్నారు. రాష్ట్రానికి గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియామకం అయిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. ఈ విషయం తనకు మొదట ఫోన్ చేసి చెప్పింది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని, ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి ‘తెలంగాణకు స్వాగతం’ అంటూ చెప్పారని పేర్కొన్నారు. ఇటీవలే ప్రధాని మోదీ హైదరాబాద్‌లో మాట్లాడుతూ ‘మీరు అనుకున్న స్థాయికి చేరాలంటే నాతో కలిసి నడువండి’ అని రేవంత్‌ను ఆహ్వానించగా, ఆయన ముసిముసి నవ్వులు నవ్విన సంగతీ తెలిసిందే.అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీకి వంతపాడిన రేవంత్‌రెడ్డి సోమవారం ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించారు. వాస్తవానికి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బద్ధశత్రువుగా భావిస్తున్న బీజేపీ, మోదీతో రేవంత్‌రెడ్డి సన్నిహితంగా ఉండటంపై మొదటి నుంచీ విమర్శలు ఉన్నాయి. తనపై ఉన్న కేసుల నుంచి రక్షించుకునేందుకు బీజేపీ, కేంద్ర ప్రభుత్వాలను రేవంత్‌రెడ్డి ఒక రక్షణ కవచంలా వాడుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేశారు. కేవలం తన వ్యక్తిగత ప్రయోజనాల కోసమే రేవంత్‌రెడ్డి బీజేపీ పాట పాడుతున్నారంటూ కొందరు కాంగ్రెస్ పార్టీ సీనియర్లు అధిష్టానాన్ని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి మాత్రం వీటన్నింటినీ పట్టించుకోకుండా బీజేపీని, గుజరాత్‌ను, మోదీని పొగడ్తలతో ముంచెత్తారు.

## వికారాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

- **కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం పెంచాలని అధికారులకు ఆదేశం**



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** వార్షిక తనిఖీలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ సోమవారం వికారాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని సమగ్రంగా తనిఖీ చేశారు. ముందుగా కార్యాలయ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులు, ఫైళ్లు, కేసులకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వికారాబాద్ సబ్‌డివిజన్ పరిధిలోని కేసుల స్థితిగతులను సమీక్షించారు. దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ కేసులు, సీడీ ఫైళ్లు, కోర్టు కేసులు, వారెంట్లు, దర్యాప్తు పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యతతో పాటు వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని, శాస్త్రీయ పద్ధతుల్లో ఆధారాలు సేకరించాలని సూచించారు. CCTNS, eSakshya వంటి సాంకేతిక సాధనాలను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా బీట్ పోలీసింగ్, పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. నేరాలు జరిగే ప్రాంతాలు, సమయాలు, నేరాల స్వభావాన్ని విశ్లేషించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా దొంగతనాలు, మహిళలు, బాలికలపై నేరాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని ట్రాఫిక్ పరిస్థితిని కూడా ఎస్పీ సమీక్షించారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అధిక ట్రాఫిక్ ఉండే ప్రాంతాలను గుర్తించి సమర్థవంతమైన ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, “ప్రతి కేసు దర్యాప్తులో నాణ్యత, పారదర్శకత, వేగం చాలా ముఖ్యమైనవి. నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలి. నేర నియంత్రణతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, మహిళలు, పిల్లల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజలకు సత్వర, పారదర్శక పోలీస్ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యం” అని తెలిపారు. అనంతరం డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎస్పీ మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ వార్షిక తనిఖీలో వికారాబాద్ డీఎస్పీ, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, సబ్‌డివిజన్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎం.ఏ. లతీఫ్‌కు ప్రతిష్టాత్మక జాతీయ యాంటీ కరప్షన్ అవార్డు




**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు, కాంగ్రెస్ నాయకుడు ఎం.ఏ. లతీఫ్‌కు ప్రతిష్ఠాత్మక జాతీయ యాంటీ కరప్షన్ అవార్డు లభించింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ నేషనల్ యాంటీ కరప్షన్ కమిటీ ఈ అవార్డుతో సత్కరించింది. భైంసా పట్టణంలోని ఓ బ్యాంకెట్ హాల్‌లో నేషనల్ యాంటీ కరప్షన్ కమిటీ ఆధ్వర్యంలో “అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా గ్రాండ్ అవేర్‌నెస్ కార్యక్రమం” నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ యాంటీ కరప్షన్ కమిటీ అధ్యక్షుడు రవీంద్ర ద్వివేది చేతుల మీదుగా ఎం.ఏ. లతీఫ్ అవార్డును అందుకున్నారు. అనంతరం పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కరోనా సంక్షోభ సమయంలో ఎం.ఏ. లతీఫ్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సహాయ సహకారాలు, ఇతర మానవతా సేవలను గుర్తిస్తూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గతంలో ముధోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన ఎం.ఏ. లతీఫ్, టికెట్ లభించకపోయినా పార్టీలో కొనసాగుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. కులమత భేదాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందిస్తూ సామాజిక సేవకుడిగా గుర్తింపు పొందారు. అవార్డు అందుకున్న అనంతరం ఎం.ఏ. లతీఫ్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డు అందించిన నేషనల్ యాంటీ కరప్షన్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. అవినీతి, నేరాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కమిటీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఎం.ఏ. లతీఫ్‌కు జాతీయ స్థాయి అవార్డు లభించడంతో భైంసా ప్రాంతానికి చెందిన ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ అధికార ప్రతినిధి అడ్వకేట్ సయ్యద్ అహ్మద్, జాతీయ మహిళా అధ్యక్షురాలు మాలికా అనీస్ ఫాతిమా, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్ ద్వివేది, మరాఠ్వాడా అధ్యక్షుడు ఇక్బాల్, ప్రాంతీయ అధికారి అహద్ సాహిల్, కార్యక్రమ నిర్వాహకులు అన్సార్ సాగర్, ముసైబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కమిటీ ప్రతినిధులు, సభ్యులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాజంలో నిజాయితీ, బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని ప్రోత్సహించడం కార్యక్రమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు



**చట్టం, హైదరాబాద్ :** శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. బిటన్ పర్యటన ముగించుకుని వచ్చిన ముఖ్యమంత్రిని సోమవారం పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సచివాలయంలో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో జరిపిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, లేకుంటే ఆ ప్రాజెక్టుల పనులు పూర్తికాబోవని ప్రజాప్రతినిధులకు స్పష్టం చేశారు.ప్రజాప్రతినిధులందరూ నియోజకవర్గాల అభివృద్ధిపై ఫోకస్ పెంచాలని, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ అనుమతులకు నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక), ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎంపీలు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టును అడ్డుకోవాలి.. అటవీ, జల వనరుల శాఖ అనుమతుల్లేవ్

- **అయినా 31న ప్రారంభానికి ఏపీ సన్నాహాలు**
- **ఇది కాంగ్రెస్ సర్కార్ చేతగానితనమే**
- **బీఆర్ఎస్ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఫైర్**




**చట్టం, హైదరాబాద్ :** ‘ఏపీ ప్రయోజనాల కోసమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నది. వెలిగొండ ప్రాజెక్టు, నల్లమలసాగర్ రిజర్వాయర్ ద్వారా అక్రమంగా నీటిని తరలించేందుకు ఏపీ ముమ్మరంగా పనులు చేపట్టింది. ఆ ప్రయత్నాలను రేవంత్ సర్కార్ అడ్డుకోవాలి’ అని బీఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ నీటి అక్రమ తరలింపును అడ్డుకోకుండా రేవంత్ సర్కార్ కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, బీఆర్ఎస్ నేత అభిలాశ్ రంగినేనితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.ఈ నెల 31న ఆ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సన్నాహాలు చేస్తున్నట్టు వార్తలొస్తున్నాయని చెప్పారు. అటవీ, కేంద్ర జలవనరుల శాఖ అనుమతులు లేకుండానే ఆ ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఏపీ నీటి తరలింపును అడ్డుకోకుండా శ్రీశైలం డ్యామ్ వద్ద కాంగ్రెస్ సర్కార్ పెద్దలు ధర్నా చేస్తామంటే ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. చిత్తశుద్ధి ఉంటే కేఆర్ఎంబీ ముందు పోరాడాలని సూచించారు. నాగార్జునసాగర్ నిండినా రైతులకు సాగునీరు ఇవ్వబోమని మంత్రి చెప్పడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. సాగునీళ్లివ్వడం చేతకాకపోతే తమ అసహాయతను ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాల పనులను పూర్తి చేయకుండా కాలయాపన చేయడం వెనుక కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఏపీ సాగునీటి తరలింపును అడ్డుకోకపోతే ఈ ప్రభుత్వం చరిత్రలో అత్యంత దుర్మార్గమైన ప్రభుత్వంగా మిగిలిపోతుందని స్పష్టంచేశారు.

**ఎల్ నినో పేరిట తెలంగాణకు దగా**

ఎల్ నినో పేరు చెప్పి అన్నదాతకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పంటలు వేయొద్దని రైతులను భయపెట్టి వారిని దగా చేస్తున్నదని ధ్వజమెత్తారు. శ్రీశైలంలో 170 టీఎంసీల నీళ్లున్నా.. ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు నీళ్లివ్వడమే లేదని తెలిపారు. కేఎల్ఐ కాలువ చివరివరకు సాగునీరు చేరకపోవడం జిల్లా మంత్రుల అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. రోజుకుసగటున 12 టీఎంసీల నీటిని ఏపీకి తరలిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడమే లేదని ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, జూరాల పంపులను నిరంతరాయంగా నడుపుతూ సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు

## జాబ్ నోటిఫికేషన్లు నిల్ లికర్ నోటిఫికేషన్లు ఫుల్ !



**చట్టం, హైదరాబాద్:** రాష్ట్రంలో లక్షలాది మంది యు వత భవిష్యత్తుకు భరోసా కల్పించే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మద్యం వ్యాపా రం కోసం మాత్రం ఆగమేఘాల మీద 121 బ్రాండ్లకు నోటిఫికేషన్ జారీ చే యడం ఏందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు విమర్శించారు.నిరుద్యోగులకు ఉ ద్యోగాలు కల్పించడం కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎకువ శ్రద్ధ ఉన్నట్టు కనిపిస్తున్నదని ఆరోపించారు. ‘జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక ర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్‌రెడ్డి చెప్పిన ప్రజాపాలన?’ అని నిలదీశారు. ప్రభుత్వ తీరుపై సోమవారం ఆయన ప్రకటనలో మండిపడ్డారు. డిగ్రీ లు, పీజీలు పూర్తిచేసిన యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే.. ప్రభు త్వం మద్యం దుకాణాలు, బ్రాండ్ల సంఖ్యను పెంచి ఆదాయం సమకూర్చుకోవడంపైనే దృష్టిపెట్టిందని విమర్శించా రు. రాజీవ్ యువవికాసం వికసించక వాడిపోయిందని, హామీలకు అతీగతీ లేకుండా పోయిందని విమర్శించారు. ‘రేవంత్ పగ.. యువత దగ’ అన్నట్టు పరిస్థితి మారిందని విమర్శించారు.

## బీఆర్ఎస్ హెచ్చరిక.. సర్కార్‌లో కదలిక

- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి దెబ్బకు కర్నెతండా లిఫ్ట్ ప్రారంభం**
- **మోటర్లను ఆన్ చేసిన మంత్రులు**



**చట్టం, ఖిల్లాఘణపురం :** వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని కర్నె తండా లిఫ్ట్‌ను ఈ నెల 20న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించి రెండ్రోజుల్లో మోటర్లు ఆన్ చేయకపోతే ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతులకు సాగునీరు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా కర్నె తండా లిఫ్ట్‌ను ఏర్పాటుచేస్తే దాన్ని ప్రారంభించడంలో రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. మాజీ మంత్రి అల్టిమేటంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలిక వచ్చింది. రూ.87.53 కోట్లతో చేపట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మోటర్‌ను సోమవారం ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేశ్‌రెడ్డి, ఎంపీ మల్లురవితో కలిసి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఈ ఎత్తిపోతల ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలో 4,235 ఆయకట్టుకు సాగునీరు అందనున్నట్టు తెలిపారు.

## అన్నీ జీరో టికెట్లేనా.. డబ్బులేవి?

**చట్టం, హైదరాబాద్:** ‘అన్నీ ఆధార్‌కార్డు టికెట్లేనా? డబ్బులేవి? కనీసం 60 శాతం క్యాష్ తీసుకురావాలన్న టార్గెట్లు మర్చిపోతే ఎట్లా? మళ్లీ ఇది రిపీట్ అయితే మెమోలు అందుకోవాల్సి వస్తుంది జాగ్రత్త’ అంటూ డిపో మేనేజర్లు కండక్టర్లను వేధింపులకు గురి చేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా యాజమాన్యం నుంచి వస్తున్న ఆదేశాలంటూ డిపో మేనేజర్లు పెడుతున్న టార్గెట్లు చేరుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. తెలంగాణలో ‘మహాలక్ష్మి పథకం’ కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో కండక్టర్ల పని స్వరూపమే మారిపోయిందని సిబ్బంది చెప్తున్నారు. బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగినా అందులో చెల్లింపులు చేసే పురుష ప్రయాణికుల సంఖ్య తగ్గడంతో క్యాష్ కలెక్షన్ తగ్గుతున్నదని అంటున్నారు.అయినప్పటికీ పాత తరహాలోనే ఆదాయ లక్ష్యాలు విధించడం వల్ల తమపై ఒత్తిడి పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలోని ఆర్టీసీ బస్సుల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీల్లో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ వంటి బస్సుల్లో మహిళా ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటున్న విషయం యాజమాన్యం దృష్టిలో ఉన్నా.. డిపో మేనేజర్ల ద్వారా కండక్టర్లకు టార్గెట్లు పెడుతున్నారని తెలిసింది. హైదరాబాద్‌లోని కొన్ని డిపోల్లో కండక్టర్లకు రోజుకు రూ.10 వేల కలెక్షన్ తీసుకురావాలని అధికారులు ఆదేశించినట్టు సమాచారం.

# తెలంగాణ సాహిత్య సరోవరం సురవరం ప్రతాప్ రెడ్డి

- **తెలుగు నేలపై వెలిగిన దీపం, జ్ఞాన జ్యోతిని పంచిన రూపం**
- **భాష కోసం పోరాడిన వీరుడు,తెలుగు తల్లి ముద్దుబిడ్డడు**
- **చరిత్రను వెలికితీసిన కలం, సమాజానికి చూపిన కొత్త వెలుగు**
- **తెలుగు భాషకు చేసిన సేవ,తరతరాలకు నిలిచే మహిమ**
- **సాహిత్య సుగంధం వెదజల్లినవాడు, తెలంగాణ గర్వంగా నిలిచినవాడు**
- **సూరవరం పేరు చిరస్థాయిగా, తెలుగు హృదయాల్లో నిలిచిపోగా!**
- **సురవరం తెలంగాణ కో వరం**

జారీరు దారుల దోపిడీ భూస్వాముల ఆది పత్యము హింస దుర్భర దారిద్రం క్రూరమైన శిక్షలు బానిసత్వం నిర్బంధ వసూళ్లు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు సంకెళ్లు ఇవే ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు ఆనవాళ్లు అలాంటి పరిస్థితిలో నిద్రాణమైన తెలుగు జాతి ని తట్టి లేపేందుకు ఉవ్వెత్తున ఎగసిన కలం కెరటం సురవరం గోల్కొండ పత్రిక స్థాపించి జన జాగృతి చేసిన వ్యక్తి తెలుగు జాతికి వరం సురవరం ప్రతాప్ రెడ్డి ఖద్దరు ధోవతి మోకాళ్ల వరకు అంగీ తెల్లని తల పాగా మెడ మీది నుండి వేలాడే ఉత్తరీయం తో పద హారణాల తెలుగు ధనాన్ని నింపుకుని కనిపించే గంబీర మూర్తి తెలుగు సారస్వత క్షేత్రం లో పసిడి పంటలు పండించిన అక్షర కృషీవలుడు సురవరం మనకాలపు మల్లి నాథుడు వీరు తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషి చేసిన మహా నీయుడు చరిత్ర వున్నంత కాలం వీరి పేరు మార్ మోగుతుంది తెలంగాణ వైతాళికుడు ప్రతిభా శాలి మేధావి తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యం అంటే వెంటనే గుర్తుకు వచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి వీరు మే 28, 1896 జన్మించారు పత్రికా సంపాదకుడుగా, పరిశోధకుడుగా, పండితుడుగా, రచయితగా, ప్రేరకుడుగా, క్రియాశీల ఉద్యమకారుడుగా బహుముఖాలుగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. స్థానిక చరిత్రల గురించి, స్థానిక ప్రజల కడగండ్ల గురించి అతను పడిన నిరంతర తపనకు ప్రతి అక్షరం ప్రత్యక్ష సాక్ష్యం. తెలంగాణలో కవులే లేరనే నిందావ్యాఖ్యలను సవాలుగా తీసుకొని 354 కవులతో కూడిన "గోల్కొండ కవుల సంచిక" గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ప్రతాపరెడ్డి ఒక అధ్యాయం. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి సంపాదకుడిగా, పత్రికా రచయితగా ప్రసిద్ధి చెందాడు. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండుగలు, నైజాం నిరంకుశ పాలనలో, తెలుగు వారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషిచేశాడు .జీవిత చివరి దశలో రాజకీయాలలో కూడా ప్రవేశించి వనపర్తి శాసనసభ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యాడు. తెలుగుజాతికి ఇతను చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం కూడా స్థానం పొందింది. 1955లోనే ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనకు గాను "కేంద్ర సాహిత్య అకాడమి" అవార్డు లభించింది. సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28 న మహబూబ్ నగర్ జిల్లాలోని ఇటిక్యాలపాడులో రంగమ్మ, నారాయణరెడ్డి దంపతులకు జన్మించాడు. ప్రతాపరెడ్డి తండ్రి చిన్నతనం లోనే మరణించారు. అతను చిన్నాన్న రామకృష్ణారెడ్డి వద్ద పెరిగి ఎబియం మిషనరీ పాఠశాలలో ప్రాథమిక విద్యను హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంటర్మీడియట్ , మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఎ. చదివాడు. 1916లో మరదలు పద్మావతిని వివాహం చేసుకున్నాడు. సంతానం పదిమందికాగా, ఇద్దరు కుమారులు విగతజీవులు. నలుగురు కుమారులు, నలుగురుపుత్రికల సంతానం. సురవరం ప్రతాపరెడ్డి తన చదువు పూర్తికాగానే హైదరాబాద్ కొత్వాల్‌గా వున్న రాజబహదుర్ వేంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలోని రెడ్డి హాస్టల్‌కు అతను కోరికపై వచ్చాడు. ఇక్కడ అతను పనిచేసిన దశాబ్ది కాలంలో రెడ్డి హాస్టల్ నిర్వహణను ఒక విద్యాలయంగా తీర్చిదిద్దాడు. నాటి నైవాసిక విద్యార్థులలో దేశభక్తి బీజాలను నాటారు. 1924 ప్రాంతంలో ఈ హాస్టల్ వదాన్యుల సహకారంతో స్థాపించబడింది. ఆ విధంగా హైదరాబాద్‌లో రెడ్డి సాంఘిక సేవా జీవితం పునాదులు వేసింది. మద్రాస్ కళాశాలలో చదువుతున్నప్పుడే నాటి జాతీయ ఉద్యమ ప్రభావం అతనుపై పడింది. నిజాం రాష్ట్రాంధ్ర దుస్థితి రూపురేఖలను మార్చాలన్న తపన ఆనాటి నుండే సురవరం మనస్సులో నాటుకొని పోయింది. హాస్టల్ కార్యదర్శిగా వచ్చాక, వేయి గ్రంథాలున్న హాస్టల్ లైబ్రరీని 11వేల గ్రంథాల వరకు పెంచి, విద్యార్థులలో భాషాభివృద్ధికి కృషి చేశాడు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ, తిరువాన్‌కూరులో బి.ఎల్ చదివాడు. కొంతకాలం పాటు న్యాయవాద వృత్తి నిర్వహించాడు. అనేక భాషలు అభ్యసించిండు. మంచి పండితుడు. 1926లో అతను నెలకొల్పిన గోలకొండ పత్రిక తెలంగాణ సాంస్కృతిక గమనంలో మైలురాయి. గోలకొండ పత్రిక సంపాదకీయాలు నిజాం ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించినయి. నిజాం ఆగ్రహించి సంపాదకీయాలు సమాచార శాఖ అనుమతితోనే ప్రచురించాలని నిబంధన పెట్టిండు. దాన్ని తిప్పికొడుతూ ప్రతాప రెడ్డి ప్రపంచ మేధావుల సూక్తులను సేకరించి సంపాదకీయానికి బదులుగా ప్రచురించిండు. అది మరింత సమస్యగా ఆనాటి ప్రభుత్వం భావించింది. తెలంగాణలో కవులే లేరని ఒక ఆంధ్ర పండితుడు ఎగతాళి చేస్తే దానికి దీటుగా 350 మంది కవుల రచనలతో గోలకొండ కవుల సంచిక అనే సంకలనాన్ని 1934లో ప్రచురించి తిరుగులేని సమాధానం చెప్పాడు. ఆ సంచిక ఇప్పటికీ అపురూపమైనది. తెలంగాణాలో గ్రంథాలయోద్యమంలో ప్రతాపరెడ్డి ప్రముఖపాత్ర వహించాడు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించాడు. 1943లో ఖమ్మంలో



జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు అతనుేఅధ్యక్షుడు. 1951లో ప్రజావాణి అనే పత్రికను ప్రారంభించాడు. 1952లో హైదరాబాదు రాష్ట్రానికి జరిగిన మొదటి ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ తరపున వనపర్తి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. న్యాయవాదిగా అతను జీవితం ప్రారంభించి, రచయితగా, కార్యకర్తగా, సంపాదకుడుగా జీవితం సాగించి తెలంగాణ ప్రజల హృదయాలలో ముద్రవేసుకున్నాడు. 1953 ఆగష్టు 25న అతను మరణించారు తెలంగాణ ప్రభుత్వం ప్రతాప్ రెడ్డి పేరిట అవార్డ్ ను సాహితీ వేత్తలకు ఇవ్వాలి .వారు జన్మించిన జిల్లాకు సురవరంప్రతాప్ రెడ్డి జిల్లా గా పేరు మార్చాలి. ప్రతీ జిల్లా కేంద్రం లో వీరి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయాలి .ప్రతీ రచయిత ,కవి వీరిని ఆదర్శంగా తీసుకుని రచనలు చేయాలి

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా**
**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు**
**ఆగస్ట్ 25 సాహితీవేత్త సురవరం ప్రతాప్ రెడ్డి వర్ధంతి సందర్భంగా**
**9848445134**

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com